PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 2 | విజయవాడ, బుధవారం 2 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 2 August 2023 | Rs

రుణమాఫీ ప్రకటించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

లోపలి పేజీలో..

కదం తొక్కిన ఇషాన్, గిల్

- హార్దిక్ కెప్టెన్సీ ఇన్నింగ్స్
- భారత్ 351/5
- రోహిత్, కోహ్లికి విశ్రాంతి
- విండీస్‌తో మూడోవన్డే

లోపలి పేజీలో..

రగిలిన మత చిచ్చు

హర్యానాలో మసీదుపై దాడి, ఇమామ్ మృతి • ఐదుకు పెరిగిన మృతులు

- పోలీసుల ఫ్లాగ్ మార్చ్
- ముస్లింల ఏరియాలో కర్ఫ్యూ

గురుగావ్ : మణిపూర్‌లో మంటలు ఆరక ముందే హర్యానాలో మతోన్మాద శక్తులు రగిల్చిన చిచ్చు దావానలంలా వ్యాపించాయి. సోమవారం నుహ్‌లో సంఘపరివార్ మూకలు రెచ్చగొట్టిన విద్వేషం, విష ప్రచారాలు నుహ్‌లో మంటలు రేపాయి. ఇప్పుడు అవి మేవాట్ దాకా పాకాయి. ఇప్పటివరకు ఈ మత చిచ్చునకు ఇమామ్‌తో సహా అయిదుగురు మరణించారు. మృతుల్లో ఇద్దరు భద్రతా సిబ్బంది కూడా వున్నారు. గురుగావ్‌లో మసీదుపై అల్లరి మూక దాడి చేసి ఇమామ్‌ను దారుణంగా పొట్టనబెట్టుకుంది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.30గంటల సమయంలో అల్లరి మూక మసీదు ముందు గల కెమెరాలను పగలగొట్టి తర్వాత నిప్పంటించారు. ఆ ఘటనలో ఇమామ్ మరణించారు.

విశ్వహిందూ పరిషత్ సోమవారం నిర్వహించిన బ్రజ్ యాత్ర సందర్భంగా మైనార్టీ ముస్లింలకు వ్యతిరేకంగా బజరంగ్ దళ్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు, విద్వేష ప్రచారమే ఈ హింసకు కారణమని పరిశీలకులు పేర్కొన్నారు. ముస్లింలు ఉండే ఏరియాలో కర్ఫ్యూ విధించారు.

మణిపూర్ మాదిరిగానే హర్యానాలోనూ హింస చెలరేగిన వెంటనే సోహ్నా, పటౌడి, మనేసర్ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేశారు. నుహ్ జిల్లాలో శాంతి భద్రతలు పునరుద్ధరించేందుకు 20 కంపెనీల మెరుపు దళాలను పంపాలని హర్యానా ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఉద్రిక్తంగా ఉన్న నుహ్‌లో పోలీసులు మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ అదుపులోనే వుందని మంగళవారం ఎక్కడా హింస జరిగినట్లు వార్తలందలేదని పోలీసులు తెలిపారు. నుహ్‌లో సోమవారం నాటి ఘర్షణల్లో 60మంది గాయపడ్డారని నుహ్ ఎస్‌పి నరేంద్ర బిజర్నియా తెలిపారు. మొత్తంగా 16ఎఫ్‌ఐఆర్‌లు నమోదైనట్లు చెప్పారు. పరిస్థితిని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అత్యవసర సమావేశం జరిపారు. ఈ అల్లర్ల వెనుక పెద్ద కుట్ర వుందని వ్యాఖ్యానించారు. ఈ అల్లర్లపై ఎన్‌ఐఎ దర్యాప్తు జరగాలని విహెచ్‌పి డిమాండ్ చేసింది.

కర్ఫ్యూ విధించడంతో నిర్మానుష్యంగా ఉన్న రహదారి, పక్కనే కాలిపోయిన దుకాణం

పార్లమెంటులో చర్చకు ఆప్ నోటీసులు

నుహ్ హింసాకాండపై బుధవారం స్వల్ప వ్యవధి చర్చను కోరుతూ ఆప్ నేత సంజీవ్ ఆరోరా రాజ్యసభ ఛైర్మన్‌కు నోటీసులు ఇచ్చారు. అల్లర్ల సందర్భంగా నరహర్ ఆలయంలో

మిగతా 5లో

మతోన్మాద దుశ్చర్యలను ఖండించిన సిపిఎం

న్యూఢిల్లీ : హర్యానాలోని మేవాట్ ప్రాంతంలో చెలరేగిన మతోన్మాద దుశ్చర్యలను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. నుహ్‌లో మతోన్మాద శక్తులు రగిల్చిన మంటలు ఇప్పుడు గురుగావ్ వరకు విస్తరించి ఐదుగురి ప్రాణాలు హరించాయి. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే మొత్తంగా ఈ పరిస్థితికి కారణమని, పైగా ఆ పరిణామాలకు ప్రభుత్వం కూడా పరోక్షంగా సహకరించిందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. బ్రజ్ మండల్ యాత్ర నిర్వహణ సాకుతో, హిందూత్వ శక్తులు - బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్‌లు సామాజిక మాధ్యమాల్లో అత్యంత రెచ్చగొట్టే రీతిలో ప్రచారాన్ని ప్రారంభించాయి. నాసిర్, జునాయిడ్‌లను వేధించి చంపేసిన కేసుతో సంబంధమున్న మోనూ మనేసర్ ఈ యాత్రలో పాల్గొనాల్సిందిగా తన మద్దతుదారులకు బహిరంగంగానే పిలుపునిచ్చాడు. బాధ్యతాయుతమైన నుహ్ ప్రజల విజ్ఞప్తులను పట్టించుకోకుండా, మనేసర్‌పై చర్యలు తీసుకోవడానికి బదులు రాష్ట్ర ప్రభుత్వం యాత్రకు అనుమతినిచ్చింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా, అవాంఛనీయ సంఘటనలు తలెత్తిన పక్షంలో వాటిని నివారించేందుకు ఎలాంటి సన్నాహక చర్యలు చేపట్టకుండా యాత్రను అనుమతించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకుని మతోన్మాద ధోరణులను రెచ్చగొట్టాలనే ఏకైక లక్ష్యంతో ఒక పద్ధతి ప్రకారం జరిగిన ఈ ప్రయత్నాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో నిర్ద్వంద్వంగా ఖండించింది.

అవిశ్వాస తీర్మానంపై 8న చర్చ

- నేడు రాష్ట్రపతిని కలవనున్న 21 మంది 'ఇండియా' ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అవిశ్వాస తీర్మానంపై ఈ నెల 8 నుంచి 10 మధ్య చర్చ జరగనుంది. ఈ మేరకు మంగళవారం జరిగిన లోక్‌సభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి)లో నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ బిఎసి సమావేశాన్ని ప్రతిపక్షాలు బహిష్కరించాయి. అవిశ్వాస తీర్మానంపై తక్షణమే చర్చ జరగాలని డిమాండ్ చేశాయి. ఈ తీర్మానంపై ప్రధాని మోడీ శుక్రవారం మధ్యాహ్నం స్పందించే అవకాశం ఉందని ప్రభుత్వం సమావేశంలో పేర్కొంది. తాము అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నామని బిజెడి జాతీయ ప్రతినిధి, రాజ్యసభ ఎంపి సస్మిత్ పాత్ర చెప్పారు. ఈ అంశాలపై చర్చ సందర్భంగా ఎంపిలంతా సభకు హాజరుకావాలని రాజ్యసభ, లోక్‌సభ ఎంపిలకు తమ పార్టీ మూడులైన్ల విప్ జారీ చేసిందని తెలిపారు.

మణిపూర్‌లో రెండు రోజులు పర్యటించిన 21 మంది 'ఇండియా' ఎంపిలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును బుధవారం నాడు కలవనున్నారు. ఉదయం 11.30 నిమిషాలకు రాష్ట్రపతిని కలిసి, మణిపూర్‌లో తమ పర్యటనలో తెలుసుకున్న అంశాలను నివేదించనున్నారు. ఎంపిలతోపాటు ఆయా పార్టీల ఫ్లోర్ లీడర్లు కూడా ఉంటారు.

గ్లోబల్ ఛార్ట్‌లోకి విశాఖ

- ఉత్తరాంధ్ర అభివృద్ధికి శ్రీకారం : ముఖ్యమంత్రి జగన్
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్రలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. విశాఖకు రహేజా ఇనార్బిట్ షాపింగ్ మాల్ ఆణిముత్యం వంటిదని, ఈ ప్రాంత రూపురేఖలు మారతాయని అన్నారు. మంగళవారం ఆయన విశాఖలో పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. తొలుత విశాఖపట్నం కైలాసపురంలోని పోర్టు స్థలమైన 17 ఎకరాల్లో రహేజా ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆంధ్రా యూనివర్సిటీలో రూ.130 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులను ప్రారంభించారు. జివిఎంసి ఆధ్వర్యాన రూ.134.58 కోట్లతో చేపట్టబోయే 47 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఇనార్బిట్ మాల్ గ్రూప్ అధ్యక్షులు కె.నీల్ రహేజాకు 17 ఎకరాలు కేటాయించామని, దీంట్లో 13 ఎకరాల్లో రూ.600 కోట్లతో మాల్ నిర్మిస్తారన్నారు. ఈ మాల్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎనిమిది వేల మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. మిగతా నాలుగు ఎకరాల్లో రెండో దశలో ఐటి కోసం కొంత స్పేస్, ఇంకొంతమేర స్థలంలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం చేపడతామన్నారు. రెండో దఫా ప్రాజెక్టుల ద్వారా మరో మూడు వేల మందికి ఉపాధి లభించనుందన్నారు. ఈ మాల్ నిర్మాణంతో విశాఖ నగర రూపురేఖలు మారడమే కాకుండా దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద మాల్‌గా అవతరించనుందని పేర్కొన్నారు. గతంలో తాను వచ్చినప్పుడు అదానీ డేటా సెంటర్ స్పేస్‌కు, శ్రీకాకుళంలో మూలపాడు సీ పోర్టుకు, భోగాపురం ఎయిర్ పోర్టుకు శంకుస్థాపనలు చేశానని, ఈ ప్రాజెక్టులతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి మంచి అడుగులు పడ్డాయన్నారు. విశాఖపట్నం 'గ్లోబల్ ఛార్ట్'లోకి వచ్చేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని పేర్కొన్నారు. విశాఖకు విచ్చేసిన ముఖ్యమంత్రికి తొలుత ఎయిర్‌పోర్టు వద్ద ఘన స్వాగతం లభించింది. సిఎం వెంట ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని, రాష్ట్ర మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఆదిమూలపు సురేష్, విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఉన్నారు.

సభలో మాట్లాడుతున్న సిఎం జగన్

సిపిఎం, ప్రజా సంఘాల నేతల గృహ నిర్బంధం

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిపిఎం జిల్లా నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్. పి.మణి, ఎస్‌ఎఫ్‌ఐ నగర నాయకులు బి.గౌతమ్‌లను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ చర్యను సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది.

సిఎంతో నీతి ఆయోగ్ బృందం భేటీ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నీతి ఆయోగ్ బృందం మంగళవారం క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి రాధ, ప్రతినిధులు పార్థసారథి రెడ్డి, నేహా శ్రీవాత్సవకు సిఎం వివరించారు. పారిశ్రామికీకరణ, నగరీకరణ అంశాల్లో దేశంలో ఎంపిక చేసిన నాలుగు నగరాల్లో విశాఖపట్నానికి స్థానం దక్కడం శుభపరిణామమని సిఎం అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, మూలపేట పోర్టు, ఇనార్బిట్‌మాల్, సబ్ మెరైన్ మ్యూజియం వంటి అభివృద్ధి పనులతో విశాఖపట్నంను ప్రపంచ పటంలో పెట్టే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, పనితీరును తమకు లిఖిత రూపంలో అందజేయాలని నీతి ఆయోగ్ కోరింది.

ప్రతిపక్షాల వ్యతిరేకత మధ్య

లోక్‌సభలో ఢిల్లీ బిల్లు

ఓటింగుకు అనుమతించని స్పీకరు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (సవరణ) బిల్లు-2023 (జిఎన్‌టిసి)ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా, హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. ఈ ఆర్డినెన్స్ బిల్లుపై బుధవారం చర్చ జరగనుంది. తొలుత లోక్‌సభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ బిల్లును ప్రవేశపెట్టారు. దీన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ బిల్లు రాజ్యాంగానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నాయి. అవిశ్వాస తీర్మానం పెండింగ్‌లో ఉన్నప్పుడు ఎలాంటి విధానపరమైన అంశాలు సభ ముందుకు తీసుకురాకూడదని, ఇది సభా ఉల్లంఘన అవుతుందని ధ్వజమెత్తారు. ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపిలు అదిర్ రంజన్ చౌదరి, ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్, సౌగత్ రాయ్, టిఆర్ బాలు, గౌరవ్ గొగోయ్, శశిథరూర్, అసదుద్దీన్ ఒవైసి తదితర ఎంపిలు వ్యతిరేకించారు. ఈ బిల్లు ఢిల్లీ అసెంబ్లీ ప్రాధాన్యతను, సుప్రీంకోర్టు తీర్పును పక్కన పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపి అధీర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ.. ఒక రాష్ట్ర హక్కులపై ఈ ప్రభుత్వం చేసిన దారుణమైన దాడిలో భాగమే ఈ బిల్లు. కనుక దీనిని ప్రవేశపెట్టడాన్ని తాను గట్టిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు ఓటింగ్‌ను కోరగా, స్పీకరు ఓం బిర్లా అందుకు తిరస్కరించారు. ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుపై కేంద్రానికి ఒడిశాలోని అధికార బిజెడి మద్దతుగా నిలిచింది. ఆ పార్టీ లోక్‌సభా పక్షనేత పినాకి మిశ్రా ప్రతిపక్షాలపై విమర్శకు దిగారు. ఢిల్లీకి సంబంధించి చట్టాలను చేసే హక్కు పార్లమెంటుకు ఉందని సుప్రీంకోర్టు తీర్పు పేర్కొందని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. ఢిల్లీలో చట్టాలు చేసే అధికారం కేంద్రానికి ఉంటుందని, ఇది రాజ్యాంగంలోనే ఉందని అన్నారు. ఢిల్లీకి సంబంధించి ఎలాంటి చట్టాన్నైనా పార్లమెంటు తీసుకురావచ్చని సుప్రీంకోర్టు సైతం చాలా స్పష్టంగా తీర్పునిచ్చిందని చెప్పారు. దీనిపై అభ్యంతరాలన్నీ రాజకీయపరమైనవేనని, బిల్లు ప్రవేశపెట్టేందుకు

మిగతా 5లో

నదుల అనుసంధానంతో కరువు దూరం

- విద్యుత్ ఛార్జీలు పెంచం
- 'ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధం'లో చంద్రబాబు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

రాష్ట్రంలో 69 నదులు ఉన్నాయని, నదుల అనుసంధానంతో కరువు రాదని టిడిపి అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నంద్యాల జిల్లా నందికొట్కూరు నుండి ప్రారంభించారు. కర్నూలు విమానాశ్రయం నుండి నందికొట్కూరుకు రోడ్డు మార్గంలో వచ్చి అక్కడ రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. పాములపాడు మండలం బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేదని, ప్రాధాన్యత లేకుండా ఇష్టానుసారంగా చేయడం వల్ల అన్యాయం జరిగే పరిస్థితి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక వైసిపి ప్రభుత్వం రివర్స్ నిర్ణయాలు చేసిందని, 198 ప్రాజెక్టులను రద్దు చేసిందని తెలిపారు. కర్నూలు జిల్లాలోని గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ కోసం ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదన్నారు. గోదావరి నీళ్లు బనకచర్లకు తీసుకురావడం తన జీవితాశయమని తెలిపారు. పశ్చిమ కర్నూలుకు ఉపయోగంలేని రాయలసీమ ఎత్తిపోతల పథకం దేనికని ప్రశ్నించారు. 2014 నుండి 2019 వరకు రాయలసీమ ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లు ఖర్చు పెడితే, వైసిపి ప్రభుత్వం కేవలం రూ.2 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. అంతకుముందు నందికొట్కూరు రోడ్ షోలో చంద్రబాబు మాట్లాడుతూ కరెంట్ ఛార్జీలు పెరగకుండా బాధ్యత తీసుకుంటానన్నారు. మద్యం ధరలు తగ్గిస్తామని, నాణ్యమైన మద్యం వస్తుందని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్క ఎకరాకూ నీళ్లిస్తామని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. పోలవరాన్ని గోదావరిలో ముంచేశారని, తాము అధికారంలోకి వస్తే ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు దేవినేని ఉమా, భూమా అఖిల ప్రియ, ఫరూక్, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, కర్నూలు జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు పాల్గొన్నారు.

ముచ్చుమర్రి ఎత్తిపోతల ప్రాజెక్టును పరిశీలిస్తున్న చంద్రబాబు

మహిళలపై పెరుగుతున్న హింస

- రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి
- కొనసాగిన ఐద్వా పోరుయాత్ర

లోపలి పేజీలో..

శాంతించిన గోదావరి

- సాధారణ స్థితికి ప్రవాహం
- కాటన్ బ్యారేజీ వద్ద 10.9, భద్రాచలం వద్ద 29.10 అడుగుల నీటిమట్టం

'నారాయణ' విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

నారాయణ స్కూల్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకి చెందిన ఇందుర్తి జయంత్ వెంకట హర్షిత్ (14) విజయవాడ సమీపానగల కానూరులోని నారాయణ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థినికి 'నిన్ను ప్రేమిస్తున్నాను' అంటూ వాట్సాప్ మెసేజ్ చేశాడు.

ఈ విషయం అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తన తల్లికి ఆ విద్యార్థిని తెలిపింది. ఈ నేపథ్యంలో స్కూల్ ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది కౌన్సెలింగ్ ఇవ్వడంతో హర్షిత్ తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం మధ్యాహ్నం పాఠశాల భవనం పైఅంతస్తు నుండి దూకాడు. తీవ్రంగా గాయపడి ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పాఠశాల యాజమాన్యం తీవ్రంగా మందలించడం వల్లే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాయపాటి ఇళ్లపై ఇడి దాడులు

- గుంటూరు, హైదరాబాద్‌లో ట్రాన్స్‌ట్రాయ్ డైరెక్టర్ల ఇళ్లలో తనిఖీలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఎగవేతకు పాల్పడిన కేసులో ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ డైరెక్టర్ల ఇళ్లపై ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు మంగళవారం గుంటూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో విస్తృత సోదాలు నిర్వహించారు. గుంటూరు లక్ష్మీపురంలోని మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావు నివాసంలో ఇడి బృందం పలు రికార్డులను పరిశీలించింది. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని రాయపాటి నివాసం, మరో డైరెక్టర్ మలినేని సాంబశివరావు నివాసంలో కూడా తనిఖీలు జరిగాయి. మొత్తం 15 బృందాలు వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాయి. రుణాల ఎగవేత కేసులో సిబిఐ ఇప్పటికే రాయపాటితోపాటు పలువురిపై కేసులు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ఇడి అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. 13 రకాల కంపెనీల పేరుతో రూ.9 వేల కోట్ల వరకు రుణాలు తీసుకున్నారని, ఒక అవసరం కోసం రుణం తీసుకుని మరో అవసరం కోసం వినియోగించారని, కొన్ని డొల్ల కంపెనీలను రికార్డుల్లో చూపించి రుణాలు తీసుకుని ఆ తర్వాత ఆ సొమ్మును వ్యక్తిగత అవసరాల కోసం వినియోగించుకున్నారని అభియోగాలు నమోదయ్యాయి. రుణాలు, వడ్డీతో సహా ప్రస్తుతం రూ.36 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. 2001లో రాయపాటి సాంబశివరావు నేతృత్వంలో ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ ప్రారంభమైంది.

2017 వరకు డైరెక్టరుగా ఉన్న మలినేని సాంబశివరావు ఆధ్వర్యంలో మనీ లాండరింగ్ జరిగినట్టు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దాదాపు 13 బ్యాంకుల నుంచి రుణాలు పొంది ఎగవేతకు పాల్పడిన కేసులో ప్రస్తుతం ఇడి దర్యాప్తు చేస్తోంది. ఈ కంపెనీ బ్యాంకు ఖాతాల నుంచి సింగపూర్‌కు నిబంధనలకు విరుద్ధంగా నగదు బదిలీ అయినట్టు ఇడి అధికారులు గుర్తించారు.

శాంతి భద్రతల యంత్రాంగం

రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలాయి

- దర్యాప్తు జాప్యం, తీవ్ర అలసత్వం
- మణిపూర్ మారణకాండపై సుప్రీం సీరియస్

న్యూఢిల్లీ : మే నెలలో జాతుల మధ్య ఘర్షణలు తలెత్తినప్పటి నుండి మణిపూర్‌లో శాంతి భద్రతల యంత్రాంగం, రాజ్యాంగ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలాయని, దర్యాప్తులో జాప్యం, అలసత్వం అడుగడుగునా కనిపిస్తోందని సుప్రీం కోర్టు తీవ్రంగా మందలించింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం మణిపూర్‌లో శాంతి భద్రతలపై ఇప్పటికే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు కోర్టు ఎదుట హాజరు కావాలని మణిపూర్ రాష్ట్ర డిజిపిని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. కోర్టు అడిగే ప్రశ్నలకు జవాబిచ్చేందుకు తగు సన్నద్ధతతో రావాలని కోరింది.

నేరాలు ఎప్పుడెప్పుడు జరిగాయి, జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు, సాక్షుల ప్రకటనల నమోదు, సెక్షన్ 161కింద స్టేట్‌మెంట్ల నమోదు, అరెస్టులకు సంబంధించి తేదీలతో సహా అన్ని వివరాలతో రావాలని కోరింది. హింసాత్మకఘటనలు జరిగిన సమయానికి, ఎఫ్‌ఐఆర్‌ల నమోదు సమయానికి, సాక్షుల ప్రకటనలు నమోదుకు మధ్య చాలా గ్యాప్ ఉందని తెలిపింది. నిందితులను అరెస్టు చేయడంలోనూ ఉపేక్షే కనబడుతోందని పేర్కొంది. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తరపున, అలాగే మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, రాష్ట్రంలో పరిస్థితి అనుకూలంగా లేనందున పోలీసుల కదలికకు పరిమితులు వుండవచ్చని వాదించారు.

" ఏవో ఒకటి రెండు కేసుల్లో మినహా మిగిలిన కేసుల్లో అసలు అరెస్టులే లేవు. దాదాపు రెండు మాసాల తరువాతే ఎఫ్‌ఐఆర్‌లు దాఖలయ్యాయి. బాధితుల ప్రకటనలు కూడా నమోదు చేయలేదు." అని చీఫ్ జస్టిస్‌చంద్రచూడ్ పేర్కొన్నారు. వీటిని సిబిఐకి అప్పగించామని తుషార్ మెహతా చెప్పడాన్ని ఆయన ఆక్షేపించారు. 6వేలకుపైగా కేసులను సిబిఐ ఒంటి చేత్తో ఎలా దర్యాప్తు చేస్తుందని ప్రశ్నించారు. ఇన్ని వేల కేసుల దర్యాప్తు భారంతో ఇక సిబిఐ 'పనిచేయకుండాపోయే' పరిస్థితి వస్తుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రాత్రికి రాత్రి సిద్ధం చేసిన యథాతథ స్థితి నివేదికను కోర్టు పరిశీలించింది. కారులో వెళుతున్న తల్లీకొడుకులను బయటకు లాగి కొట్టి చంపేశారని, ఈ ఘటన మే 4న జరిగితే జులై 23న కానీ ఎఫ్‌ఐఆర్ నమోదు కాలేదని కోర్టు పేర్కొంది. ఇలా నెలల పాటు ఆలస్యంగా నమోదైన కేసులు చాలానే వున్నాయి. కొన్ని చోట్ల సిసిటివి పుటేజీని కూడా తొలగించిన వైనం వెలుగు చూసింది.

సిబిఐకి 11 ఎఫ్‌ఐఆర్‌ల బదిలీ

మొత్తంగా 6523 కేసుల ప్రాథమిక దర్యాప్తు జరగగా, తదుపరి దర్యాప్తు నిమిత్తం 11 కేసులను సిబిఐకి బదిలీ చేశారు. ఇందుకు సంబంధించి ఏడుగురిని అరెస్టు చేశారు. అయితే తాము కీలకమని పేర్కొన్న ఐదు ఎఫ్‌ఐఆర్‌లు ఆ వాటిలో లేవని జోమి విద్యార్థి సమాఖ్య తరపు

మిగతా 5లో

ఉద్యోగ భద్రత కోసం రోడ్డెక్కిన కార్మికులు

- రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల ముట్టడి
- పలుచోట్ల అరెస్టులు, విడుదల

ప్రకాశం జిల్లా ఒంగోలులో నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-యంత్రాంగం

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని, గత ఎన్నికల ముందు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు మంగళవారం కదంతొక్కారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాలను ముట్టడించారు. పలు జిల్లాల్లో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు. ఏలూరు కార్పొరేషన్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య పెద్దఎత్తున వాగ్వాదం జరిగింది. దీంతో రెండుగంటలపాటు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది గేటుబయట రోడ్లపైనే నిలబడిపోయారు. కార్యాలయ విధులు స్తంభించాయి. ఈ సదర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా, అసెంబ్లీలోనూ, బయట మున్సిపల్ కార్మికులకు అనేక హామీలిచ్చారన్నారు. ఆ హామీలను నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ అమలు చేయలేదని, అందుకే మున్సిపల్ కార్మికులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఈ నెల 7న కలెక్టరేట్లను ముట్టడిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 17న చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. జంగారెడ్డిగూడెంలో నగర పంచాయతీ కార్మికులు, సిఐటియు నాయకులు మున్సిపల్ ఆఫీసును ముట్టడించి నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన సిఐటియు నేతలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. కార్మికుల ఆందోళనతో కొద్దిసేపటికి వారిని విడిచిపెట్టారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మున్సిపల్ కార్యాలయాలను మున్సిపల్ కార్మికులు ముట్టడించారు. విధులకు హాజరైన ఉద్యోగులను కార్యాలయాల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాంతో పాటు 132 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళంలో 87 మందిని, ఆమదాలవలసలో 15 మందిని, పలాసలో 30 మందిని అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయం గేటు వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. కమిషనర్ వెంకటేశ్వరరావు ఆందోళనకారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎప్పటిలోగా పరిష్కరిస్తారో తెలియజేస్తూ లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని కార్మికులు పట్టుబట్టడంతో తమ సిబ్బంది రాసి ఇస్తారంటూ కమిషనర్ అక్కడ నుంచి వెళ్లిపోయారు. కమిషన్ తీరును నిరసిస్తూ కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు యూనియన్ నాయకులను అరెస్టు పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా కార్మికులు అడ్డుగా నిలిచారు. దీంతో పోలీసులు, కార్మికుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. యూనియన్ నాయకులు, కార్మికుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. పరుస పదజాలంతో దూషించారు. కార్మికులను బూటుకాళ్లతో తొక్కుతూ బలవంతంగా అక్కడ నుంచి నెట్టేశారు. యూనియన్ నాయకులను వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. తరువాత విడిచిపెట్టారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించి అక్కడే వంటావార్పు నిర్వహించారు. సత్తెనపల్లిలో మున్సిపల్ కార్యాలయం మెయిన్ గేటు ఎదుట కార్మికులు బైఠాయించారు. ఉద్యోగులు విధులకు వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసులు పలువురు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్మికుల ఆందోళనతో వారిని విడుదల చేశారు. గుంటూరులో నగరపాలక సంస్థ కార్యాలయం గేటు ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. విజయనగరం జిల్లాలోని విజయనగరం కార్పొరేషన్, బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం, రాజాం, నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయాల వద్ద కార్మికులు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. విజయనగరంలో మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్‌మోహన్‌రావు మాట్లాడారు. బొబ్బిలిలో మున్సిపల్ కార్యాలయానికి కార్మికులు గేట్లు వేసి బైఠాయించడంతో మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణ, ఉద్యోగులు, కౌన్సిలర్లు బయటే ఉండిపోయారు. మున్సిపల్ చైర్మన్‌ను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరులో 26 మందిని, పాలకొండలో 40 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వారిని విడుదల చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో పెద్దబొడ్డేపల్లి సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించారు. కోనసీమ జిల్లా మండపేటలో ర్యాలీ చేశారు. తిరుపతి జిల్లా గూడూరులో కార్యాలయానికి తాళాలు వేసి ఆందోళన చేపట్టారు. నాయుడుపేటలో వంటావార్పు చేసి నిరసన తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, హిందూపురం ప్రాంతాల్లో కార్మికులు మున్సిపల్ కార్యాలయాల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కృష్ణా, నెల్లూరు, కడప, కూర్నూలు, నంద్యాల జిల్లాలో ఆందోళనలు చేపట్టారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై దృష్టి

- సిఎస్‌తో నీతి ఆయోగ్ అధికారుల భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై నీతి ఆయోగ్ ప్రత్యేక దృష్టి సారించిందని ఆ సంస్థ అదనపు కార్యదర్శి వి రాధ పేర్కొన్నారు. రాష్ట్రంలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్ కేంద్రం ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. నీతి వి రాధ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సచివాలయంలో సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డితో మంగళవారం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధిక వృద్ధి రేటు సాధన కోసం అభివృద్ధి వ్యూహాల రూపకల్పనకు గానూ రానున్న రెండేళ్లలో రూ.5.28 కోట్లు నీతి ఆయోగ్ అందించనుందని తెలిపారు. రాష్ట్రం వృద్ధి రేటు సాధనలో నీతి ఆయోగ్ ఆర్థిక, నాలెడ్జ్ పరమైన సహకారం అందిస్తుందన్నారు.

సిఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరీకరణ, పారిశ్రామికరణ అంశాల్లో దేశ వ్యాప్తంగా నాలుగు నగరాలను ఎంపిక చేస్తే వాటిలో విశాఖపట్నం ఉండటం సంతోషదాయకమన్నారు. పర్యాటక పరంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్రంలో పలు ప్రాజెక్టులను నెలకొల్పుతున్నట్లు ఆయన వెల్లడించారు.

యువతలో మరింత నైపుణ్య శిక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉందని, అందుకు నీతి ఆయోగ్ ప్రత్యేక దృష్టి సారించాలని సిఎస్ సూచించారు. రంగాల వారీ ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అంశాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నీతి ఆయోగ్ సలహాదారులు పార్థసారధిరెడ్డి వివరించారు. సమావేశంలో ప్రణాళికా శాఖ కార్యదర్శి గిరిజా శంకర్, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్ఎస్ రావత్, వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, పిఆర్ అండ్ ఆర్‌డి ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పల్నాడు దాహార్తి తీరుస్తాం

- వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు చర్యలు
- యువగళం యాత్రలో లోకేష్ హామీ

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలంలో పాదయాత్ర చేస్తున్న లోకేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధికారంలోకి రాగానే పల్నాడులో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం ముప్పరాజుపాలెం గ్రామంలోకి మంగళవారం ప్రవేశించింది. ముప్పరాజుపాలెం నుంచి రవ్వారం, గుర్రపునాయుడు పాలెం వరకు యాత్ర కొనసాగింది. నూజెండ్ల మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు లోకేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు గుక్కెడు నీళ్లవ్వలేని ముఖ్యమంత్రి రూ.లక్షల కోట్లతో సంక్షేమం చేశానని ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సదుపాయం కల్పించేందుకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా ఈ ప్రభుత్వం వినియోగిం చుకోలేకపోతోందని విమర్శించారు. జలజీవన్ మిషన్ అమలులో దేశంలో రాష్ట్రం 18వ స్థానంలో ఉందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వాటర్ గ్రిడ్ ఏర్పాటుచేసి, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన మంచినీరు అందిస్తామని, వ్యవసాయ పెట్టుబడులు తగ్గించి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి నాయకులు రూ.ఏడు వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రతిపేదవాడికి ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. నూజెండ్ల మండలంలోని రవ్వారం గ్రామంలో ప్రజలు లోకేష్‌కు సమస్యలను విన్నవించారు. వైసిపి పాలనలో గ్రామీణ రహదారులు తటాకాలను తలపిస్తున్నాయని, పంచాయతీ నిధులను ప్రభుత్వం తన ఖాతాలకు మళ్లించడంతో గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయిందని లోకేష్ విమర్శించారు. పాదయాత్రలో టిడిపి కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

‘అసైన్డ్’ సవరణను నిలిపివేయండి

- ప్రజా సంఘాల చర్చా వేదిక డిమాండ్
- మరో భూపోరాటానికి సమాయత్తం కావాలని పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం దళితులకు భూమి హక్కు కల్పించే పేరుతో వున్న భూములను కూడా భూస్వాములు లాక్కునేలా తీసుకు వస్తున్న అసైన్డ్ భూముల 9/77 చట్ట సవరణను నిలిపివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలోని ఎంబివికెలో వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, సామాజిక సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అసైన్డ్ భూముల 9/77 చట్టసవరణ - యాజమాన్యపు హక్కులు- వాస్తవాలు అనే అంశంపై చర్చా వేదిక జరిగింది. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షులు కొరివి వినయకుమార్‌ల అధ్యక్షతన జరిగిన ఈ చర్చావేదికలో దళితులను భూములనుండి వెళ్లగొట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా అసైన్డ్ చట్టసవరణకు పూనుకుంటోందని వక్తలు విమర్శించారు. ఈ చట్టసవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా మరో భూ పోరాటానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సీనియర్ ఐఎఎస్ అధికారి టి గోపాల్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూసమస్యలు వామపక్షపార్టీలకు తప్ప వైసిపి, తెలుగుదేశంతో సహా ఏ పార్టీకి పట్టడం లేదన్నారు. దళితులు, పేదల భూసమస్యలను రాజకీయ అజెండాగా మార్చాలన్నారు. దీనికోసం కార్యాచరణను రూపొందించాలని చెప్పారు.

దళితులకు ఇచ్చిన భూముల్లో 50శాతం ఇప్పటికే అన్యాక్రాంతం అయ్యాయని తెలిపారు. మిగిలివున్న భూములను కూడా ఈ చట్టసవరణతో భూస్వాములు లాక్కుంటారని పేర్కొన్నారు. అసైన్డ్ భూములు అమ్మినా కొన్నా నేరమవుతుందని 1977లో చట్టాన్ని తీసుకు వస్తే ఇప్పటిదాకా నామమాత్రంగా ఈచట్టాన్ని అమలు చేస్తున్న పాలకపార్టీలు ఇక శాశ్వతంగా భూములను లాక్కునేలా ఏకంగా చట్టాన్ని సవరించేందుకు పూనుకోవడం తగదని అన్నారు. 9/77 చట్టం వున్నా ప్రభుత్వాలు ఎస్ఇజెడ్, ఇళ్లస్థలాల కోసం పేదల భూములను దౌర్జన్యంగా లాక్కుంటోందని విమర్శించారు. దీనికి ప్రజా ఉద్యమాలతోపాటు న్యాయపోరాటాలకు సమాయత్తం కావాలని తెలిపారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1954 నుండి 2002 మధ్యకాలంలో అసైన్డ్ భూములు పొందిన పేదలకు హక్కులు కల్పిస్తామనే మంత్రివర్గ నిర్ణయం కుట్ర పూరితమైందని అన్నారు. రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూమి అన్యాక్రాంతం అయ్యిందని నివేదిక ఇస్తే ఏ ప్రభుత్వం ఈ భూములకు విముక్తి కల్పించేందుకు పూనుకోలేదని విమర్శించారు. కోనేరు రంగారావు కమిటీ భూసమస్యలపై చేసిన సిఫార్సులను ప్రభుత్వాలు అమలు చేయకుండా భూస్వాములు భూములు లాక్కుంటుంటే చోద్యం చూస్తున్నాయన్నారు. తక్షణం ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో అసైన్డ్‌భూముల వివరాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన అసైన్డ్‌భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూములు కోల్పోయిన పేదలకుగాని, వారి వారసులకు అప్పగించాలని అన్నారు. దళిత, గిరిజన జెఎసి ఛైర్మన్ పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దళితులు, గిరిజనులకు తీరని ద్రోహం చేస్తోందన్నారు. ఇప్పటికే 27 పథకాలను రద్దు చేసిన ఈ ప్రభుత్వం దళితుల చేతుల్లో వున్న కొద్దిపాటి భూములను లాక్కునేందుకు ఈ చట్టసవరణకు పూనుకుంటోందని విమర్శించారు.

నెల్లూరులో అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఒకరు 150 ఎకరాలను కాజేస్తే మమరొకరు 270 ఎకరాలను లాక్కున్నారని ఇలాంటి భూములకు క్రమబద్ధీకరించేందుకే చట్టసవరణకు పూనుకుంటున్నారని చెప్పారు. ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర నాయకులు ముజఫర్ అహ్మద్, ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ కె ధనలక్ష్మి, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఆర్ రఘు, నాగమణి, కెవిపిఎస్ నాయకులు నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ జడ్జి తీర్పుపై ప్రభుత్వం పిల్

ప్రజాశక్తి-అమరావతి

మోటారు కార్లను కొనేటప్పుడు విధించే లైఫ్ ట్యాక్స్ వాహన నికర ఇన్వాయిస్ ధర (పన్నులు కలపక ముందున్న ధర) మేరకు నిర్ణయించాలే గానీ ఎక్స్‌షోరూమ్ (పన్నులన్నీ కలిపిన తర్వాత ధర) మేరకు కాదని సింగిల్ ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ వేర్వేరుగా దాఖలు చేసిన అప్పీళ్లను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది. వాహన ధర అంటేనే పన్నులతో కలిపి అని ఎజి ఎస్ శ్రీరామ్ వాదించారు. 1994 నాటి సర్క్యులర్ ప్రకారమే వసూలు చేయడం అవుతోందన్నారు. లైఫ్‌ట్యాక్స్ ఎలా వసూలు చేయాలో కూడా స్పష్టంగా ఉందన్నారు. 1993కు ముందు వాహన బరువు ఆధారంగా లైఫ్‌ట్యాక్స్ ఉండేదన్నారు. ఆ తర్వాత వాహనాల ధరల ఆధారంగా ఉందన్నారు. వాదనల తర్వాత ధర్మాసనం, సింగిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వం వేసిన కౌంటర్ కాపీని నివేదించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

బిఎస్3 వాహనాలు నడుపుతున్న జెసి

- ప్రభాకర్‌రెడ్డిపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బిఎస్-3 వాహనాలను టిడిపి నేత జెసి ప్రభాకర్‌రెడ్డి అక్రమంగా నడుపుతున్నారని తెలంగాణ హైకోర్టులో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. ఏడాది క్రితం ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, బిఎస్-3 వాహనాలను బిఎస్-4గా తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించారని కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రభాకర్‌రెడ్డి వాహనాలను జప్తు చేసి సిబిఐ దర్యాప్తు చేయించాలని పెద్దారెడ్డి పిటిషన్‌లో కోరారు. పెద్దారెడ్డి పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు.. కౌంటరు దాఖలు చేయాలని రవాణా, హోంశాఖ ముఖ్య కార్యదర్శులు, డిజిపి, రవాణాశాఖ కమిషనర్, జెసి ప్రభాకర్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ సెప్టెంబరు 12కి వాయిదా వేసింది.

జులైలోనూ లోటే

- ఆదాయం 5,579 కోట్లు
- ఖర్చు 19 వేల కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారీ లోటుతో ఉన్న ఖజానా రెండో త్రైమాసికంలో కూడా అదే దిశగా సాగుతోంది. జులై నెలలో ఏకంగా 13,500 కోట్ల వరకు లోటు తేలింది. ఈ నెలలో ఆదాయం కేవలం రూ. 5,579 కోట్లు కాగా, వ్యయం మాత్రం 19 వేల కోట్లకు చేరిపోయింది. దీంతో ఈ లోటు మొత్తాన్ని రుణాల రూపంలో తీసుకున్న నగదు, కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లుతో భర్తీ చేసుకున్నారు. కాగా మొత్తం నాలుగు నెలల్లో లోటు దగ్గరదగ్గరగా 64 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నట్లు తేలింది.

ముంపు ప్రాంతాల పరిశీలనకు టిడిపి కమిటీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాల్లో భారీ వర్షాలు కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించి, నిర్వాసితులను పరామర్శించడంతోపాటు జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు టిడిపి కమిటీలను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆయా కమిటీలు రెండు నియోజకవర్గాల్లో పర్యటించి సమగ్ర నివేదికను పార్టీ రాష్ట్ర కార్యాలయానికి అందించనున్నాయి. పోలవరం నియోజకవర్గానికి నిమ్మల రామానాయుడు, గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్‌ను కమిటీ సభ్యులుగా నియమించారు. రంపచోడవరానికి నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, అరిమిల్లి రామకృష్ణారెడ్డిని నియమించారు. ఈ రెండు కమిటీలు ఈ నెల 2 నుంచి ఆయా నియోజకవర్గాల్లో పర్యటించనున్నాయి.

సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబువి అబద్ధాలే

- వైసిపి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎంవిఎస్ నాగిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై చెబుతోందంతా అబద్ధాలేనని వైసిపి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎంవిఎస్ నాగిరెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమలో చంద్రబాబు పదిరోజులపాటు యుద్ధభేరీ చేస్తానంటూ వెళ్లి అన్నీ అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసినా రాష్ట్రానికి కాదుకదా కనీసం సొంత నియోజకవర్గం కుప్పానికి నీళ్లు ఇవ్వలేక పోయారని విమర్శించారు. రాయలసీమ ప్రాంతంలో హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టులను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టారని అన్నారు. చంద్రబాబు చేపట్టిన ఒక్క ప్రాజెక్టు పేరయినా చెప్పాలని డిమాండ్ చేశారు. పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమకు ఈ నాలుగేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 553 టిఎంసిల నీరు మళ్లిస్తే, చంద్రబాబు ఐదేళ్ల హయాంలో కేవలం 310 టిఎంసిలను మాత్రమే తీసుకున్నారని తెలిపారు.

టిడిపి స్పాన్సర్డ్ సినిమా బ్రో : అంబటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ పవన్‌కల్యాణ్‌కు ప్యాకేజి ఇచ్చే కార్యక్రమంలో భాగంగానే బ్రో సినిమాను తీశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. తన రాజకీయ శత్రువులను తిట్టేందుకు మాత్రమే సినిమా తీసినందునే బ్రో బాక్సాఫీస్ వద్ద బోల్తాపడిందని తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్‌కు ఇచ్చే ప్యాకేజీ బ్లాక్ మని వైట్ చేసేందుకు చంద్రబాబునాయుడు బ్రో సినిమా తీయించారని అన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన సినిమా నిర్మాత టిజి శివప్రసాద్‌కు అమెరికాలో పలు సాఫ్ట్ వేర్ కంపెనీలు వున్నాయని తెలిపారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- వైసిపి ఎమ్మెల్యే వేణుగోపాల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రం ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు వైసిపి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సవాల్ విసిరారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఇప్పటికే డిబిటి (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా రూ.2.25 లక్షల కోట్లను సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించిందని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు జరిగిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. యువగళం పాదయాత్రలో భాగంగా లోకేష్ దర్శిలో తనపై పూర్తిగా నిరాధారమైన ఆరోపణలు చేశారని అన్నారు.

ఎపి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు సభ్యులుగా కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు సభ్యులుగా పెద్దపోగు కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కోటేశ్వరరావును సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు ఈ అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపి విజయసాయిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

హరికిషన్ సింగ్ సూర్జిత్‌కు ఘన నివాళి

సిపిఎం అగ్రనేత హరికిషన్ సింగ్ సూర్జిత్ వర్థంతి సందర్భంగా విజయవాడ బాలోత్సవ భవన్లో మంగళవారం నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు బి.ఆర్. తులసీరావు సుర్జిత్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

మన్యం బంద్ జయప్రదానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - అల్లూరి జిల్లా విలేకరుల యంత్రాంగం

మణిపూర్‌లో ఆదివాసీలపై దాడులను నిరసిస్తూ ఈ నెల 3న తలపెట్టిన మన్యం బంద్‌ను జయప్రదం చేయాలంటూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన అల్లూరి జిల్లా వ్యాప్తంగా ప్రచారం ఊపందుకుంది. పాడేరు పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్డులోని అంబేద్కర్ సెంటర్ మీదుగా పాత బస్‌స్టాండ్ వరకూ బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, రాష్ట్ర నాయకులు అప్పలనర్స మాట్లాడారు. మణిపూర్‌లో ఆదివాసీలపై కార్పొరేట్లు, మతోన్మాద శక్తులు జరుపుతున్న మారణహోమాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ముంచంగిపుట్టు, జి.మాడుగుల, విఆర్.పురం, రాజవొమ్మంగి మండలాల్లోనూ స్థానిక నాయకులు పలుచోట్ల ప్రచారం చేపట్టారు.

ఎస్‌హెచ్‌జిలపై ఆంక్షలు?

- సభ్యులందరికీ ఎస్‌బి ఖాతాలు
- అంతర్గత రుణాలు తప్పనిసరి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

స్వయం సహాయ సంఘాలపై కొత్త ఆంక్షలు విధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్‌బిఐ ఉత్తర్వుల మేరకు అంతర్గత రుణాలు తప్పనిసరి అని చెబుతూ ఈ కొత్త ఆంక్షలు విధించనున్నారని సమాచారం.స్వయం సహాయ సంఘాల్లో మహిళలకు బ్యాంకర్ల ద్వారా ఐదు లక్షల నుంచి 20 లక్షల వరకు రుణాలు ఇస్తుంటారు. దీనిపై 9.5 శాతం నుంచి 13 శాతం వరకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని సేవింగ్స్ ఖాతాలో జమ చేస్తే కేవలం 2.34 శాతం వరకు మాత్రమే వడ్డీ వస్తుంది. ఇది ఆర్థికంగా సంఘాల ప్రయోజనాలకు విరుద్ధం. దీనిని దృష్టిలో ఉంచుకుని అంతర్గత రుణాలను ప్రోత్సహిస్తున్నారు. అయితే తాజాగా నిర్వహించిన ఒక సర్వేలో గత మూడేళ్లుగా అంతర్గత రుణాలకు స్వయం సహాయక సంఘాలుదూరంగా ఉంటున్నట్లు తేలింది. అనేక సంఘాల్లో సభ్యుల సేవింగ్స్ ఖాతాల వినియోగం కూడా తక్కువగా ఉన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో రిజర్వు బ్యాంకు మార్గదర్శకాల మేరకు సంఘాల ఆర్థిక వ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సభ్యుల మధ్య, సంఘాల మధ్య అంతర్గత రుణాల విధానాన్ని కూడా పెంచాలని తెలిపారు. సభ్యులందరు సేవింగ్స్ ఖాతాలు తెరిచి. వాటిని వినియోగించుకోవడం ప్రారంభించిన తరువాతనే వారికి జీవనోపాధి రుణాలు, ఎంటర్‌ప్రైజెస్ రుణాలను బ్యాంకు లింకేజి ద్వారా ఇచ్చేలా చూడాలని కూడా నిర్దేశించారు. ఈ విధానాన్ని అమలు చేయడంలో తేడాలు వస్తే ప్రాజెక్టు డైరెక్టర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని సెర్ప్ అధికారులు హెచ్చరించారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

విద్యుత్ సౌధ నుంచి ర్యాలీ చేపట్టిన కార్మికులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కర్నూలు కలెక్టరేట్ ఎదుట విద్యుత్ ఉద్యోగులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అంతకు ముందు విద్యుత్ సౌధ నుంచి కొత్త బస్టాండు, రాజ్‌విహార్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేశారు. విద్యుత్ ఉద్యోగ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎఇ అసోసియేషన్ నాయకులు అంకం మహేశ్వరరావు, ఇంజనీరింగ్ సెక్షన్ నాయకులు గంగన్న, 1104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య, రంగస్వామి, శివకుమార్, విరూపాక్షి రెడ్డి హుస్సేన్, ప్రసాద్, రామరాజు మాట్లాడారు. 2022 ఫిబ్రవరి ఒకటి నుంచి 2023 ఆగస్టు 31 మధ్య నియామకమైనటువంటి ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జెఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పెండింగులో ఉన్న కారుణ్య నియామకాలు, డిఎ బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని కోరారు. ఏకసభ్య కమిషన్‌ను రద్దుచేసి పిఆర్‌సి 2022ను వెంటనే అమలు చేయాలని, ఎస్‌సిలు పిపిలు లేకుండా అందరికీ ఒకే మాస్టర్ స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగి రాకపోతే ఆగస్టు 10న నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపి ట్రాన్స్‌కో ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యాయం

- దళిత, గిరిజన జెఎసి ఛైర్మన్ గోపాలరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాను నిధులు ఇవ్వకుండా ఇతర అవసరాలకు మళ్లించి వాటినే ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌లో చూపిస్తున్నారని రిటైర్డు ఉన్నతాధికారి గోపాలరావు తెలిపారు. వేర్వేరు సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులను కూడా ఇదే ఖాతాలో చూపించి మోసం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దళిత, గిరిజన జెఎసి ఆధ్వర్యాన మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జెఎసి నాయకులు కొరివి వినయ్‌కుమార్, పనబాక కృష్ణయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాను చట్టం అమలు కావడం లేదని తెలిపారు.

గతంలో కాలపరిమితి తీరిపోయిందని, మళ్లీ పొడిగించారని అయినా అమల్లో అనేక లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. వేర్వేరు సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులను కూడా ఇదే ప్లానులో చూపించి దళితులకు చట్టబద్ధంగా అందాల్సిన నిధులను వేరేచోటుకు బదిలీ చేస్తున్నారని అన్నారు. దీనివల్ల దళిత, గిరిజనులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. వాటిని జనరల్ ఫండ్స్‌లో కలిపేసి నవరత్నాలకు ఇస్తున్నారని విమర్శించారు. 70 శాతం నిధులు వెచ్చించామని చెబుతున్నారని, ఎక్కడ వెచ్చించారు? ఎంత వెచ్చించారు? అనే వివరాలు కేంద్రం వద్ద లేవని పేర్కొన్నారు. నోడల్ ఏజెన్సీలు పనిచేయడం లేదని, సిఎం ఆధ్వర్యాన జరగాల్సిన ఎపెక్స్ కమిటీ సమావేశాలు వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్కటి కూడా జరగలేదని అన్నారు. సబ్‌ప్లాను చట్టానికి కాలపరిమితి ఎత్తేయాలని, దళితుల సామాజిక అసమానతలు తగ్గించే పథకాలకు మాత్రమే ఆ నిధులు వాడాలని కోరారు.

గిరిజన హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం

- రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం కల్పిస్తామని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. నాగరికత, అభివృద్ధికి గిరిజన ప్రజలను మరింత చేరువ చేసేందుకు కమిషన్ తరపున తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మంగళవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గిరిజనుల దీర్ఘకాలిక సమస్యలు, హక్కుల పరిరక్షణ, చట్టాల పర్యవేక్షణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై మాట్లాడారు. కమిషన్ తరపున రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తామని, వారి హక్కులు, చట్టాల అమలుపై వారిలో చైతన్యం నింపుతామని ఉద్ఘాటించారు. గిరిజనుల అభ్యున్నతికి, ఉన్నత లక్ష్యాల సాధనకు కమిషన్ ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. సమీక్షలు నిర్వహిస్తూ గిరిజనుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తామని, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ, డోలీ కష్టాలు, బోయ కులస్తులను ఎస్‌టి జాబితాలో చేర్చడం, విజయనగరం జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు, గిరిజన ప్రాంతాల్లో రోడ్ల సదుపాయాలపై విలేకరులు ప్రశ్నించగా.. క్షేత్ర స్థాయి పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

మహిళలపై పెరుగుతున్న హింస

- రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి
- కొనసాగిన ఐద్వా పోరుయాత్ర

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, నెల్లూరు

దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలు, చిన్నారులపై రోజురోజుకూ దాడులు, హింస విపరీతంగా పెరిగిపోతున్నాయని ఐద్వా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రారంభమైన 'మహిళా పోరుయాత్ర' తిరుపతి మీదుగా నెల్లూరు, విశాఖలో ప్రారంభమైన యాత్ర అనకాపల్లి జిల్లా మీదుగా కాకినాడకు ప్రవేశించింది.

నెల్లూరు బొల్లినేని సెంటర్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల బాలికలు, ప్రభుత్వ పాఠశాల బాలికలతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింసను వివరించారు. ఈ హింసపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మానవత్వం ఉన్న రాజకీయ నాయకులెవరైనా సరే మణిపూర్ ఘటనకు బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానంతో విపక్షాలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. బిజెపి చేస్తోన్న దురాగతాన్ని రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అంతకుముందు నగరంలోని అయ్యప్పగుడి సెంటర్‌లో యాత్రకు మహిళలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి మహిళా కళాకారులు ఆలపించిన గీతాలు, నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

నెల్లూరులో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న రమాదేవి

కాకినాడ జిల్లా తుని గొల్ల అప్పారావు సెంటర్‌లో ప్రజాసంఘాల నాయకులు జాతాకు స్వాగతం పలికారు. అనంతరం పిఠాపురం మీదుగా కాకినాడ చేరుకున్న యాత్రకు సిఐటియు, మిడ్డే మీల్స్, తదితర సంఘాల నాయకులు, జడ్‌పి సెంటర్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పిఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తుని, పిఠాపురం, కాకినాడలో జరిగిన సభల్లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి మాట్లాడారు. బిజెపి తొమ్మిదేళ్ల పాలనలో మహిళలు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎపిలో 35 వేల మంది మహిళలు, చిన్నారులు అదృశ్యమైతే పాలకవర్గాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. పోక్సో చట్టాన్ని ఎత్తివేయడానికి ప్రయత్నిస్తున్న బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మహిళలంతా ఉద్యమించాలని కోరారు. స్వాగతం పలికిన వారిలో సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు టి.రాజా తదితరులున్నారు.

ఆలోచింపజేసిన ప్రదర్శనలు

పోరుయాత్ర సందర్భంగా ఐద్వా సభ్యుల ప్రదర్శనలు అందర్నీ ఆలోచింపజేశాయి 'ఎక్కడ వచ్చింది స్త్రీకి స్వాతంత్ర్యం', 'ఎక్కడమ్మా నీవు లేనిది' నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. మద్యపానం వల్ల జరిగే అనర్థాలను, మహిళలపై జరుగుతున్న దాడులను వివరిస్తూ పలుచోట్ల వీధినాటికలు ప్రదర్శించారు.

రుణమాఫీ ప్రకటించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

'రాష్ట్రంలో ఒకవైపు వరదలు, మరోవైపు కరువు నెలకొనడంతో రెండు విధాలుగా రైతులు నష్టపోతున్నారు. ఇటువంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి వారిని ఆదుకోవాలి' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అనంతపురంలోని గణేనాయక్ భవనంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పంటలు చేతికందక రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2018, 2019 కంటే 2020లో కొంత వరకు రైతు ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టినప్పటికీ 2021, 2022, 2023లో క్రమంగా అధికమవుతున్నాయని తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు ప్రభుత్వమిస్తున్న రూ.ఏడు లక్షల పరిహారం కూడా సక్రమంగా అందడం లేదన్నారు. ఏదో ఒక కారణం నమోదు చేసి పరిహారం డబ్బులు ఎగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రైతు ఏ రూపంలో చనిపోయినా తెలంగాణలో రూ.ఐదు లక్షలు పరిహారం ఇస్తున్నారని..ఆ విధానాన్ని ఎపిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే వచ్చే పంటల బీమా మొత్తం లోపభూయిష్టంగా ఉందన్నారు. ఇది కూడా ప్రయివేటు బీమా కంపెనీలకు లాభం చేకూర్చేదిగా ఉందని విమర్శించారు. 2022లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కంపెనీలకు పంటలబీమా కింద రూ.లక్షల కోట్లు ప్రీమియం కడితే రైతులకు పరిహారంగా ఇచ్చింది రూ.700 కోట్లు మాత్రమేనని చెప్పారు. అందుకే పంటల బీమా విధానంలో రైతుకు లాభం చేకూర్చే విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులకు కూడా రుణమాఫీ వర్తించే విధంగా అమలు చేయాలని కోరారు.

పార్లమెంట్‌లో మౌనం...ఇక్కడ అనుకూలమైన ప్రకటనలు

మణిపూర్ ఘటనపై పార్లమెంటులో విపక్ష పార్టీలన్నీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపిలు మౌనంగా ఉంటున్నాయని విమర్శించారు. అక్కడ మాట్లాడకుండా ఇక్కడికొచ్చి మీకు అండగా ఉంటామని చెప్పడం మోసకారితనమే అవుతుందని దుయ్యబట్టారు. జనసేన కూడా మణిపూర్ ఘటనపై కేంద్రాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమరయాత్రే

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్
- తరలివచ్చిన విద్యార్థి లోకం
- రెండో రోజుకు చేరిన సైకిల్‌యాత్ర

ప్రజాశక్తి -శృంగవరపుకోట

విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే సంగ్రామ యాత్ర సమరయాత్రగా మారుతుందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోటలోని పుణ్యగిరి కాలేజీ నుంచి ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర మంగళవారం రెండోరోజు ప్రారంభమైంది. ఈ సందర్భంగా పట్టణంలోని దేవి కూడలి వద్ద నిర్వహించిన బహిరంగ సభకు వందలాది మంది విద్యార్థులు తరలివచ్చారు. ఈ సభలో ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డికి బటన్ నొక్కడంపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంపై లేదన్నారు.

సభకు హాజరైన విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులు పరిస్థితి ఆధ్వానంగా మారిందని, విద్యార్థులకు చాలీ చాలని భోజనం పెడుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచి, వారి ఆకలి తీర్చాలని డిమాండ్ చేశారు. మరోపక్క ప్రభుత్వ విద్యను విద్యార్థులకు దూరం చేసే విధంగా మోడీ మీద ప్రేమతో జగన్ నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం నాశనమవుతుందని మండిపడ్డారు. వెంటనే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారని, దానిలో భాగంగా జిఒ 77 తీసుకొచ్చి మొత్తం ఉన్నత విద్యకు మంగళం పాడేశారన్నారు. డిగ్రీలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ విధానాన్ని విద్యార్థుల స్థాయికి, సిలబస్‌కు అనుగుణంగా పెట్టాలని కోరారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలకు సొంత భవనాలను నిర్మించి, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి రామ్మోహన్ రావు మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి నిర్వహిస్తున్న సంగ్రామ సైకిల్ యాత్రను విద్యార్థులు ప్రజలు ఆదరిస్తున్నారని. ఇప్పటికైనా సమస్యల పరిష్కారం కోసం పాలకులు, అధికారులు కృషి చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చినబాబు, ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనకు భద్రతా ఏర్పాట్లు

- డిజిపికి వర్ల రామయ్య లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేయనున్న నీటిపారుదల ప్రాజెక్టుల సందర్శన యాత్రకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా కల్పించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డిజిపికి ఆయన లేఖ రాశారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అనేక నీటి పారుదల ప్రాజెక్టులు, తాగునీటి పథకాలను వైసిపి ప్రభుత్వం నిలిపివేసిందని అన్నారు. రైతుల బాధలు దృష్టిలో ఉంచుకుని ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన చేపట్టారని వర్ల రామయ్య పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు భద్రతపై అనేక వైఫల్యాలు చోటుచేసుకున్నాయని, కొంతమంది పోలీసు అధికారులు కొన్ని దురుద్దేశాలతో భద్రతా ఏర్పాట్లను సరిగా చేయడం లేదని లేఖలో పేర్కొన్నారు.

ఆర్‌డిఓపై ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు:

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఆర్‌డిఓ కేంద్ర ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌ను ఉల్లంఘిస్తున్నారని టిడిపి కార్యాలయ కార్యదర్శి పి అశోక్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసరు ముకేష్‌కుమార్‌మీనాకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తెలుగుదేశం బూత్ లెవల్ ఏజెంట్లను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు.

ఆర్మీ జవాన్ వీర మరణం

- జమ్ము కాశ్మీర్ ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి
- అధికార లాంచనాలతో నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి - పాములపాడు

సిరిగిరి సురేంద్ర (ఫైల్)

జమ్ముకాశ్మీర్ బారాముల్లా జిల్లాలో సోమవారం జరిగిన ఉగ్రవాదుల ఎదురుకాల్పుల్లో భారత జవాన్ వీర మరణం చెందారు. ఆయన కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... నంద్యాల జిల్లా పాములపాడు మండలం మద్దూరు మజరా గ్రామం కృష్ణనగర్‌కు చెందిన సిరిగిరి సురేంద్ర (24) 2019 మార్చి 31న ఆర్మీలో చేరారు. జమ్ముకాశ్మీర్‌లో సోమవారం జరిగిన ఉగ్రవాదుల ఎదురుకాల్పుల్లో మధ్యాహ్నం 12 గంటలకు సురేంద్ర వీర మరణం చెందారు. మరణ వార్త తెలిసిన కృష్ణానగర్‌లోని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగారు. పేద రైతులైన సిరిగిరి సుబ్బయ్య, సుబ్బమ్మల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దేశ రక్షణ కోసం చిన్న కుమారుడు సురేంద్రను ఆర్మీలోకి పంపారు. మంగళవారం సురేంద్ర భౌతికకాయం స్వస్థలానికి చేరుకుంది. అధికార లాంఛనాలతో సురేంద్ర అంత్యక్రియలు బుధవారం జరగనుంది. సురేంద్ర భౌతికకాయాన్ని తహశీల్దార్ రత్న రాధిక, ఎంపిడిఒ గోపికృష్ణ, ఇఒఆర్‌డి శ్రీనివాసులు నాయుడు సందర్శించారు.

భారీ కుంభకోణానికి పాల్పడిన పెద్దిరెడ్డి

- హోంమంత్రి అమిత్‌షాకు రామచంద్రయాదవ్ ఫిర్యాదు

ప్రజాశక్తి - పుంగనూరు (చిత్తూరు)/న్యూఢిల్లీ బ్యూరో

నాలుగేళ్లలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భారీగా అక్రమార్జనకు పాల్పడ్డారని, ఇడి, సిబిఐతో దర్యాప్తు చేయించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్రయాదవ్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలో అమిత్ షాను కలిసి పెద్దిరెడ్డిపై ఫిర్యాదు చేశారు. సూట్‌కేసు కంపెనీలు, భూకబ్జాలు, బినామీపేరిట ఆస్తులు కొట్టేయడం, ప్రాజెక్టుల నుంచి కమీషన్లు తీసుకోవడం, ఖాతాలను తారుమారు చేయడం, లిక్కర్‌స్కామ్‌లు ఇలా అనేక ఆర్థిక నేరాల్లో మంత్రి పెద్దిరెడ్డి ఆరితేరిపోయారని ఆరోపించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బంధువులు, కుటుంబసభ్యులు ఇలా మొత్తం 17 మంది డైరెక్టర్ల పేరిట 61 కంపెనీలు ఉన్నాయని, ఇవన్నీ మరో 50 కంపెనీలతో లింక్ అయ్యాయని తెలిపారు. వీటి ద్వారా రూ. 35 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఎర్రచందనం స్మగ్లింగ్, లిక్కర్ స్కామ్‌లు, అక్రమ మార్గాల్లో కాంట్రాక్టులు పొందడం, నిబంధనలు పాటించకపోవడం, ఖనిజ సంపదను అక్రమంగా దోచుకోవడం ద్వారా వేలాది కోట్లు కొల్లగొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పెద్దిరెడ్డిని అనర్హుడిగా ప్రకటించేలా న్యాయ పోరాటం చేస్తామన్నారు.

4 ఆస్పత్రులకు ముస్కాన్ సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు అందించే సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ముస్కాన్ (చిరునవ్వు) సర్టిఫికెట్లను రాష్ట్రంలో నాలుగు ప్రభుత్వాస్పత్రులు దక్కించుకున్నాయి. శ్రీకాకుళంలోని రిమ్స్ బోధనాస్పత్రి, కర్నూలులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రకాశం జిల్లా మార్కాపురంలోని జిల్లా ఆస్పత్రి, బాపట్ల జిల్లా రేపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రాలకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి విశాల్ చౌహాన్ రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబుకు మంగళవారం రాసిన లేఖలో వెల్లడించారు.

దక్షిణమధ్య రైల్వే

మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-టెండర్ నోటీసు ఆహ్వానం (http://ireps.gov.in ద్వారా) PUB/0854

భారత రాష్ట్రపతి మరియు చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్), సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ తరపున టెండరింగ్ యొక్క సింగిల్ ప్యాకెట్ సిస్టమ్ లో క్రింది విధమైన పనుల కొరకు ఇ-టెండర్‌లు ఆహ్వానించడమైనది.

1. నిట్ నం.: టెండర్ నం.09-2023-2024-ఇ-జిఎస్-సిఎన్-బిజెడ్ఎ, పని పేరు : విద్యుత్ నిర్మాణం/బిజెడ్ఎ : విజయవాడ-ఖాజీపేట స్టేషన్ల మధ్య విద్యుద్దీకరణతో న్యూ బిజి 3వ లైన్ యొక్క ఎన్‌డబ్ల్యుబిహెచ్-బిజెడ్ఎ, పిఎన్‌డిపి-సికెఎన్, సికెఎన్-ఎమ్‌టిఎమ్ఐ, వైపి-ఎమ్‌డిఆర్ మరియు ఎమ్‌డిఆర్-ఎమ్‌టిఎమ్ఐ సెక్షన్ల భాగంగా ప్రీ-ఎన్ఐ/ఎన్ఐ పనికి సంబంధించి లైటింగ్ ఏర్పాట్లు, ఎయిర్ కూలర్లు, ఫ్యాన్లు, షామియానాలు మరియు కుర్చీలు మొదలైన వాటితో సహా డిజి సెట్లతో తాత్కాలిక అంతరాయం లేని విద్యుత్ సరఫరా ఏర్పాట్లను అందించడం. అంచనా ఖరీదు : రూ.72,92,346/-, ఇఎమ్‌డి : రూ.1,45,900/-, టెండర్ డాక్యుమెంట్ ఖరీదు : లేదు, పూర్తి కాలం : 12 (పన్నెండు) నెలలు, ముగింపు తేది : 21.08.2023, 15.00 గం. వద్ద.

1) బిడ్ డాక్యుమెంట్లు మరియు ఇతర వివరాల కొరకు http://ireps.gov.in లాగిన్ అవ్వండి.
2) బిడ్ సెక్యూరిటీ/ఇఎమ్‌డి ఐరెప్స్‌లో ఇ-చెల్లింపు గేట్‌వే ద్వారా నగదు రూపంలో డిపాజిట్ చేయబడుతుంది లేదా ఎఫ్ఎ మరియు సిఎఓ/సి/ఎస్‌సికి అనుకూలంగా బ్యాంక్ గ్యారంటీ బాండ్‌గా భారతీయ షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి లేదా టెండర్ డాక్యుమెంట్‌లలో పేర్కొన్న విధంగా సమర్పించబడుతుంది. బ్యాంక్ గ్యారంటీ బాండ్ అనుబంధం-విఐఎ ప్రకారం ఉంటుంది మరియు బిడ్ చెల్లుబాటు వ్యవధి కంటే 90 రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది.
3) టెండర్లు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు టెండర్ వ్యవధి కాలం ముగింపుకు పదిహేను రోజుల ముందు సమర్పించాలి.
4) ఏదైనా సవరణ కొరకు (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) టెండర్ సమర్పణ కాలం ప్రారంభం వరకు టెండరర్లు చూసుకోవాలి.

డిప్యూ. చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (కన్‌స్ట్రక్షన్)
విజయవాడ

తేది : 31.07.2023, టెండర్ నం.జిటిఎల్-జిఎస్‌యు-విద్యుత్-02-2023-24. PUB/0855

భారత రాష్ట్రపతి మరియు సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్వహణ/గుంతకల్లు తరపున క్రింది పనులకు తాత్కాలిక బాధ్యతలు నిర్వహించేందుకు ఇ టెండర్లను ఆహ్వానించడమైనది.

1. టెండర్ నం. : జిటిఎల్-జిఎస్‌యు-02-2022-23, పని పేరు : గుంతకల్లు డివిజన్-గాటి శక్తి- కెపిడి-టిపిటివై సెక్షన్: బొమ్మసముద్రం వద్ద రెండవ లూప్ లైన్‌కు సంబంధించి ఇప్పటికే ఉన్న ఓహెచ్ఇకి మార్పులతో సహా ఎల్‌టి సరఫరా ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్లు, 25 కెవి 50 హెచ్‌జెడ్ సింగిల్ ఫేజ్ ఎసి ట్రాక్షన్ ఓవర్‌హెడ్ పరికరాలు 65 చ.మీ.మీ. కాటెనరీ వైర్ మరియు 107 చ.మీ.మీ. హెచ్‌డిజి కాపర్ కాంటాక్ట్ వైర్, డిజైన్ సరఫరా, ఎరక్షన్ టెస్టింగ్ మరియు కమీషన్. సుమారు విలువ : రూ.1,30,06,006.28/-,

ముగింపు తేది మరియు సమయం : 14.08.2023, 15.00 గం. వద్ద.

టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in లాగిన్ అవ్వండి టెండర్ యొక్క సవరణ ఏదైనా ఉంటే ఆన్‌లైన్ లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండరర్లు టెండర్ డాక్యుమెంట్లను http://www.ireps.gov.in ద్వారా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

గమనిక : ఈ ఇ టెండర్‌లో పాల్గొనడానికి/బిడ్ చేయడానికి, టెండరర్లు చెల్లుబాటు అయ్యే డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్)ని కలిగి ఉండవలెను.

ఎస్‌ఆర్. డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్లు.

A1195

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

చంద్రబాబుది 'ఏడుపు యాత్ర'

- రాయలసీమ ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాయలసీమ ప్రాజెక్టులపై చంద్రబాబుకు మాట్లాడే అర్హత లేదని, కుప్పంలో చర్చకు తమ పార్టీ సిద్ధమని రాష్ట్ర అటవీ ఇంధన, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సవాల్ విసిరారు. తిరుపతి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మంత్రి మాట్లాడుతూ 14 ఏళ్లు సిఎంగా ఉండి సొంత నియోజకవర్గానికి నీరు ఇవ్వలేకపోయిన అసమర్థుడు చంద్రబాబని ఎద్దేవా చేశారు. ఆయన రాయలసీమ కోసం అంటూ చేసేది 'ఏపుడు యాత్ర' మాత్రమేనన్నారు. చంద్రబాబు ఏం చేశారో, వైఎస్ జగన్ ఏం చేశారో కుప్పంలోనే చర్చిద్దామన్నారు. గండికోట ద్వారా పుంగనూరు, తంబళ్లపల్లి, పీలేరు, మదనపల్లికి నీరు అందించేందుకు వైఎస్ జగన్ ఆవులపల్లి, నేతిగుంట్లపల్లి, ముదివేడు ప్రాజెక్టులు నిర్మిస్తుంటే సుప్రీంకోర్టుకు వెళ్లి చంద్రబాబు అడ్డుకున్నారన్నారు. కుప్పం బ్రాంచి కెనాల్‌నూ కమీషన్ల కక్కుర్తితో పూర్తి చేయలేదని విమర్శించారు. 200 కోట్ల అంచనా వ్యయాన్ని 440 కోట్లకు పెంచి సిఎం రమేష్‌కు పనులు కట్టబెట్టలేదా అని ప్రశ్నించారు. గాలేరు-నగరి ప్రాజెక్టుకు 1995 నుంచి 2004 వరకూ ఖర్చు చేసింది అక్షరాలా 17.52 కోట్లు మాత్రమేనని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 4,283.08 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు.

దండిగా పన్ను వసూళ్లు

- జులైలో రూ.1.65 లక్షల కోట్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వాలు పన్నుల రూపంలో దండిగా వసూలు చేస్తున్నాయి. వరుసగా ఐదోసారి రూ.1.60 లక్షల కోట్ల పైనా వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూలు కావడమే ఇందుకు నిదర్శనం. ప్రస్తుత ఏడాది జులైలో దేశంలో రూ.1.65 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లు నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరుగుదల చోటు చేసుకుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. గడిచిన నెల పన్ను వసూళ్లలో సిజిఎస్‌టి కింద రూ.29,773 కోట్లు, ఎస్‌జిఎస్‌టి కింద రూ.37,623 కోట్లు, ఐజిఎస్‌టి కింద రూ.85,930 కోట్లు చొప్పున వసూళ్లయ్యాయి. సెస్ పరంగా రూ.11,779 కోట్లు వచ్చాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.18.10 లక్షల కోట్లు వసూళ్లయ్యాయి. గడిచిన నెలలో ఆంధ్రప్రదేశ్‌లో 5 శాతం వృద్ధితో రూ.3,593 కోట్ల జిఎస్‌టి వసూళ్లయ్యింది. గతేడాది ఇదే జులైలో రూ.3,409 కోట్లుగా నమోదయ్యింది. ఇదే సమయంలో తెలంగాణలో రూ.4,547 కోట్లు వసూలు కాగా.. 2023 జులైలో 7 శాతం వృద్ధితో రూ.4,849 కోట్లకు పెరిగింది.

ముగిసిన మోబిక్ 6వ ఎడిషన్

ముంబయి : మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ (ఎంఒఎఫ్ఎల్ఎల్) బ్రోకింగ్ సేవలను విస్తరించడానికి వీలుగా ముంబయిలో ఏర్పాటు చేసిన మోతీలాల్ ఓస్వాల్ బిజినెస్ ఇంపాక్ట్ కాన్ఫరెన్స్ (మోబిక్) 6వ ఎడిషన్ ముగిసిందని ఆ సంస్థ తెలిపింది. జులై 29, 30 తేదిల్లో నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్‌లో భారతీయ ఈక్విటీ మార్కెట్ల గురించి చర్చించినట్లు తెలిపింది. దీనికి తమ 2,000 పైగా భాగస్వాములు హాజరైనట్లు పేర్కొంది. ఈ సందర్భంగా మోతీలాల్ ఓస్వాల్ గ్రూప్ ఎండి, సిఇఒ మోతీలాల్ ఓస్వాల్ మాట్లాడుతూ.. భారత స్టాక్ మార్కెట్ వృద్ధి చెందుతుందన్నారు. ఈక్విటీలలో పెట్టుబడి పెట్టడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

హీరో మోటో ఛైర్మన్‌పై పిఎంఎల్ఎ కేసు

- ముంజల్ నివాసాల్లో ఇడి దాడులు
- పడిపోయిన షేర్ల ధరలు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటో కార్ప్ ఛైర్మన్ పవన్ ముంజల్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మానీలాండరింగ్ కేసును నమోదు చేసిందని సిఎన్‌బిసి ఓ కథనంలో వెల్లడించింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో సోమవారం ముంజల్‌కు చెందిన నివాసాలు, కార్యాలయాల్లో ఇడి సోదాలు చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ ఫిర్యాదు మేరకు ఇడి అధికారులు దిల్లీ సహా గురుగ్రామ్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు.

మైక్రోసాఫ్ట్ ఇండియా వైస్ ప్రెసిడెంట్‌గా పునీత్ చందోక్



న్యూఢిల్లీ : మైక్రోసాఫ్ట్ ఇండియా కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్‌గా పునీత్ చందోక్ నియమితులయ్యారు. చందోక్ భారత్‌తో పాటు దక్షిణాసియాలో కంపెనీ కార్యకలాపాలను పర్యవేక్షించనున్నారు. సెప్టెంబర్ 1 నుంచి చందోక్ నూతన బాధ్యతలు చేపడతారని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. చందోక్ గతంలో అమెజాన్.కాం క్లౌడ్ డివిజన్ ఎడబ్ల్యుఎస్‌లో పనిచేశారు.

'ఫెర్రో' పరిరక్షణకు ఆగస్టు చివరి వారంలో

చలో విజయవాడ

- 7న కలెక్టరేట్ల ముట్టడి
- ఫెర్రో ఎల్లాయిస్ రాష్ట్ర సదస్సులో తీర్మానం
- ఉద్దేశ పూర్వకంగానే విద్యుత్ ఛార్జీల పెంపు : సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల పరిరక్షణకు ఆగస్టు చివరి వారంలో చలో అసెంబ్లీ నిర్వహించాలని, ఈలోపు దశలవారీగా పోరాటాన్ని ఉధృతం చేయాలని ఎపి స్టేట్ ఫెర్రో ఎల్లయిస్ వర్కర్స్ కో ఆర్డినేషన్ కమిటీ నిర్ణయించింది. ఈ నెల 7న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు చేపట్టాలని సంకల్పించింది. విజయనగరంలోని రెవెన్యూ హోంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ అధ్యక్షతన మంగళవారం రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఫెర్రో ఎల్లాయిస్‌పై ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించు కోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని సదస్సు హెచ్చరించింది. చలో విజయవాడ, కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, కంపెనీల ఎదుట నిరసన దీక్షలు తదితర ఉద్యమ కార్యాచరణపై సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టివి రమణ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. దీనికి ముందుకు సదస్సులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 36 ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఉండగా, ఒక్క విజయనగరంలోనే 21 పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. వీటిపై ప్రత్యక్షంగా 60 వేలు, పరోక్షంగా 6 లక్షల కుటుంబా లు జీవనం సాగిస్తున్నాయని వివరిం చారు. ఉత్పత్తిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండడం వల్ల విద్యుత్ భారంతో పరిశ్రమలు చాలా కాలంగా ఆర్థిక ఒడిదొడుకుల మధ్య నడుస్తున్నాయని వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో పరిశ్రమలకు విద్యుత్ రాయితీలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఛార్జీలను పెంచడం వల్ల భారం తట్టుకోలేని యాజమాన్యాలు మూసివేతకు సిద్ధమౌతున్నాయని తెలిపారు. మార్చి 31 వరకు ఒక యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.4.95 ఉండగా, ఏప్రిల్ 1 నుంచి ఒక యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.8.55లకు ప్రభుత్వం పెంచిందన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం సూచన మేరకు రాష్ట్రం దాని అమలుకు పూనుకుందని తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపు వల్ల ఇప్పటికే విజయనగరం జిల్లాలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో 5, గరివిడి ప్రాంతంలో 3, కొత్తవలస ప్రాంతంలో ఒకటి ఇప్పటికే మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గరివిడి ఫేకర్ సహా మరికొన్ని పరిశ్రమల్లో ఉత్పత్తిని తగ్గించారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పరిశ్రమలను కాపాడాల్సిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ 'లాభాలు వచ్చినప్పుడు ఎవరికైనా ఇచ్చారా?' అంటూ యాజమాన్యాలను ఎగతాళి చేయడం బాధ్యతా రాహిత్యమన్నారు. చిత్తశుద్ధి ఉంటే యాజమాన్యాలకు నిర్దిష్టమైన భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడు తూ ఫెర్రో పరిశ్రమలు మూతపడితే ఒక్క విజయన గరం జిల్లా లోనే ప్రత్యక్షంగా 15 వేల మందికి ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిశ్రమకు పెంచిన విద్యుత్ చార్జీల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వాన్ని రోడ్డుపైకి లాగేందుకు కార్మికులంతా సిద్ధం కావాలని అన్నారు. సదస్సులో సిఐటియు నాయకులు ఎ.గౌరినాయుడు, అనకా పల్లి జిల్లా సిఐటియు నాయకులు ఆర్.రాము, గరి విడి, కొత్తవలస బొబ్బిలి, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ఫెర్రో ఎల్లాయిస్ కార్మికులు మాట్లాడారు.

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013

PUBLIC NOTICE

Finkurve Financial Services LTD., through his facilitated partner **Augmont Gold Tech Pvt. Ltd.**, వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: **05.08.2023** వ సమయం **10** గంటలకు **CMS INFO SYSTEMS LTD. Ground Floor, Door No.4-4-156, Chandhra Mauli Nagar, 6th Length, Guntur - 522 007**. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.

ABS : ABS -69808. RSR Associate : RSR -15573, RSR -53111, RSR -91006.

For More Details, Contact : Ramprasad Nandipati, Mob. 9246482477

(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013

PUBLIC NOTICE

Finkurve Financial Services LTD. through his facilitated partner Augmont Gold Tech Pvt. Ltd. వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: **05.08.2023** వ సమయం **10** గంటలకు **Augmont Gold For All, Door No. 26-25-29, 1st Floor, Gnavoluvari Street, Gandhi Nagar, BRTS Junction, Vijayawda - 520003.** వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.

VIJAYWADA : VIJA-47938, VIJA-22084, VIJA-22918, VIJA-76902, VIJA-61647, VIJA-20121, VIJA-80839, VIJA-45113, VIJA-26754, VIJA-04817, VIJA-65727, VIJA-79544.

For More Details, Contact : Ramprasad Nandipati, Mob. 9246482477

(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

సంపాదకీయం

నిజాన్ని ఎదుర్కోలేక...

నిజాలను ఎదుర్కోలేని వారు అసత్య ప్రచారాన్నే నమ్ముకుంటారు. మోడీ సర్కారు పరిస్థితి అలాగే ఉంది. గోడీ మీడియా ద్వారా నిరంతరం అబద్ధాలను ప్రచారంలో పెట్టి ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించడం, లేని అభివృద్ధిని గ్రాఫిక్స్‌లో చూపించడం అలవాటైన కేంద్ర ప్రభుత్వానికి నిజాలు నిద్రపట్టనీయడం లేదు. అందుకే గద్దెనెక్కింది మొదలు గణాంకాల గొంతు నులిమేందుకు సర్వప్రయత్నాలు చేస్తోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పరిధిలో ఉంటూ జాతీయ కుటుంబ సర్వేలు నిర్వహించే ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపిఎస్) డైరెక్టర్ కెఎస్ జేమ్స్‌ను కేంద్రప్రభుత్వం ఇటీవల సస్పెండ్ చేసింది. సంస్థ విడుదల చేసిన సర్వే వివరాలు... సాక్షాత్తూ ప్రధాని చెబుతున్న మాటలన్నీ అబద్ధాలని నిర్ధారించిన నేపథ్యంలోనే ఈ సస్పెన్షన్ జరిగింది.

స్వచ్ఛభారత్, ఉజ్వల యోజన తదితర పథకాల అమలుపై మోడీ సర్కారు ప్రచారమంతా శుద్ధ అబద్ధమని ఐఐపిఎస్ సర్వే బహిర్గతం చేసింది. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి ఐదేళ్లయిన సందర్భంగా దేశం బహిరంగ మల విసర్జన (ఒడిఎఫ్) నుంచి పూర్తిగా బయటపడిందని, 60 కోట్ల మంది ఆ అలవాటుకు దూరమయ్యారని 2019 అక్టోబర్ 2న ప్రధాని నరేంద్రమోడీ ఘనంగా ప్రకటించారు. ఐఐపిఎస్ సర్వే-5లో నేటికీ దేశంలో దాదాపు ఐదో వంతు (19 శాతం) కుటుంబాలు మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటకు పోతున్నారని నిర్ధారణ అయ్యింది.

గ్రామీణ మహిళలకు సబ్సిడీపై వంట గ్యాస్ అందిస్తున్నందున వారికి కన్నీళ్లు తప్పాయని కేంద్రం ప్రచారం చేసుకుంటోంది. తాజా సర్వేలో 57 శాతం ఇళ్లకు వంట గ్యాస్ సౌకర్యం అందుబాటులో లేదని తేలింది. ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారుల్లో రక్తహీనత గత సర్వేల్లో కంటే అధికంగా ఉందని సర్వే తేల్చింది. 'పోషణ్ అభియాన్' పేరుతో కేంద్రం ప్రచారం హోరెత్తిస్తుండగా.. దేశంలో రక్తహీనత భారీ స్థాయిలో ఉందని ఈ సర్వే నిర్ధారించింది. ఫిబ్రవరిలో ఐఐపిఎస్ కౌన్సిల్ సమావేశంలో రక్తహీనతకు సంబంధించి సంస్థ ఇచ్చిన డేటాపై కేంద్ర ఆరోగ్యమంత్రి మాండవీయ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇది పశ్చిమ దేశాల కుట్రలో భాగమేనా? అంటూ జేమ్స్‌ను ప్రశ్నించారు. అంతేగాక సర్వే-6లో రక్తహీనతకు సంబంధించి వివరాలు లేకుండా చేసేశారు.

వినిమయం, వ్యయం తదితర అధ్యయనాలను మోడీ ప్రభుత్వం తన మొదటి విడత పాలనాకాలంలోనే పక్కనపెట్టింది. సర్వేల కొలబద్దలను మార్చేసింది. జాతీయ స్థూల ఉత్పత్తి (జిడిపి) లెక్కింపునకు ప్రామాణిక సంవత్సరాన్ని మార్చేసింది. హౌస్‌హోల్డ్ సర్వేకు 2011-12 ఏడాది బేస్ ఇయర్‌గా ఉండగా, 2017-18ని ప్రామాణికంగా తీసుకుంటామని ప్రకటించింది. 2019 జనవరిలో దేశంలో నిరుద్యోగంపై వచ్చిన సమాచారాన్ని సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకూ తొక్కిపెట్టింది. ఈ చర్యకు నిరసనగా జాతీయ గణాంకాల కమిషన్ తాత్కాలిక ఛైర్మన్ పిసి మోహనన్ సహా పలువురు సభ్యులు రాజీనామా చేశారు. 150 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా పదేళ్లకు ఒకసారి చేయాల్సిన జనగణనను వాయిదా వేస్తూ వస్తోంది. ప్రణాళికా సంఘాన్ని అటకెక్కించింది. నీతి ఆయోగ్ పేరుతో తనకు నచ్చిన నివేదికలు తయారు చేయించుకుంటూ రాష్ట్రాల నిధులను కొల్లగొడుతోంది.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలు చేయడం, ప్రభుత్వం నిర్దేశించే ఇతర బాధ్యతలు నిర్వహించేందుకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన 2018లో ముంబై కేంద్రంగా ఐఐపిఎస్ ప్రారంభమైంది. దాని డైరెక్టర్ జేమ్స్ నేతృత్వంలో ఐఐపిఎస్ ఎంతో చురుగ్గా పనిచేస్తూ డేటా సేకరణ, విశ్లేషణల్లో కొత్త విధానాలు ప్రవేశపెట్టిందని పలువురు ప్రజారోగ్య రంగ నిపుణులు ప్రశంసిస్తున్న తరుణంలో ఆయనను సస్పెండ్ చేయడం గర్హనీయం. శాస్త్రవేత్తలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో నిధులు, నియామకాలు, రిజర్వేషన్లు తదితర విషయాల్లో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు రావడంతో సస్పెన్షన్‌లో పెట్టామంటూ ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఇద్దరు అదనపు కార్యదర్శులు సభ్యులుగా ఉన్న 12 మంది కమిటీ ఆధ్వర్యాన జరిగే నియామకాలకు ఆయన ఒక్కడే బాధ్యుడెలా అవుతాడో ఏలిన వారికే తెలియాలి. వాస్తవాలను స్వీకరించి సరిదిద్దుకోకుండా నిజాలను పాతరేసేందుకు చేసే ప్రయత్నాలు బెడిసికొడతాయని చరిత్ర మనకు చెబుతోంది. నిజం నిప్పు లాంటిది. దాన్ని ఎవరూ దాచిపెట్టలేరు.

మహనీయుల మాట

ప్రపంచంలో ఎక్కడ ఆపద ఉన్నా స్పందించడానికి సిద్ధంగా ఉండు.

- చే గువేరా

కడప ఉక్కు పరిశ్రమకు ద్రోహం చేసిన పాలకులు

విశ్లేషణ

నాలుగు సార్లు శంకుస్థాపనలు చేసినా నాలుగు అడుగులు కూడా ముందుకు పడని ఏకైక పరిశ్రమ కడప ఉక్కు పరిశ్రమ. తొమ్మిది సంవత్సరాలుగా దేశాన్ని పాలించిన బిజెపి నమ్మకద్రోహానికి నిదర్శనం 25.7.2023న కడప ఉక్కు పరిశ్రమపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రకటన. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం పది సంవత్సరాల్లో నిర్మించాల్సిన ఈ ఉక్కు పరిశ్రమను పది సంవత్సరాల తర్వాత బిజెపి నేతలు పురిటిలోనే గొంతు నులిమేశారు. ఆంధ్రుల అభివృద్ధిని, ఆత్మగౌరవాన్ని పాతాళానికి తొక్కేస్తున్న ఆ ధృతరాష్ట్ర కౌగిలిలోనే తమ భవిష్యత్తును వెతుక్కుంటున్నాయి వైసిపి, టిడిపి పార్టీలు. పార్లమెంట్ చట్టాలను పాతరేసి ఊరేగుతున్న బిజెపి నేతలను ప్రశ్నించాల్సిన వైసిపి, టిడిపి లు నిస్సిగ్గుగా వారికి విశ్వాసాన్ని ప్రకటిస్తూ ఆంధ్ర ప్రజల ఆత్మాభిమానాన్ని మంటగలుపుతున్నాయి. కడప ఉక్కు ఏమైపోతేనేం...ఆ కేసులు తమ గడప దాటి రాకుండా వుంటే చాలనుకుంటున్నాయి.

కడప ఉక్కు పరిశ్రమ వచ్చేసినట్లే అని ఇప్పటి వరకు ప్రకటనలు చేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చింది. ఇక్కడ పరిశ్రమ సాధ్యాసాధ్యాలను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) అధ్యయనం చేసి నివేదిక ఇచ్చిందట. అందువల్ల కడప ఉక్కు పరిశ్రమ లాభదాయకం కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి...మన రాష్ట్ర వైసిపి, టిడిపి ఎంపీల ప్రశ్నకు రాతపూర్వకంగా చెప్పేశారు. ప్రశ్న అడిగిన ఎంపీలు మాత్రం మౌన ముద్ర దాల్చారు. ఇన్నాళ్లుగా పరిశ్రమ గురించి మీరే మాట్లాడారు కదా, పర్యావరణ అనుమతులు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు అనుమతి ఇచ్చారు కదా, ప్రభుత్వ రంగంలో లాభదాయకం కానిది ప్రైవేట్ జిందాల్ కంపెనీకి ఎలా లాభదాయకం అయ్యింది అని ఒక్కరంటే ఒక్కరు అడగలేదు. తమ బాస్‌లు ప్రశ్న వేయమన్నారే కాని బదులు ప్రశ్న వేయమనలేదేమో! సెయిల్ అధ్యయనం చాటున తన చేతికి రక్తపు మరకలు అంటకుండా కడప ఉక్కును, రాయలసీమ యువత ఆశలను బిజెపి హత్య చేసింది. తమ పార్టీకి 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచుతానన్న జగన్ మోహన్ రెడ్డి కేంద్రం ముందు సాగిలపడుతున్నారు. 2018లో కడప ఉక్కు పరిశ్రమ కోసం ఆమరణ దీక్షలు చేసిన టిడిపి నేడు మౌన దీక్షలో వుంది. ప్రశ్నించే రాజకీయాలు అంటూ రంకెలు వేస్తున్న జనసేన ఏకంగా ... రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపి భజనలో తరిస్తున్నది. కడప ఉక్కు రాయలసీమ ప్రజల హక్కు అని, ఢిల్లీలో గర్జిస్తానని గత ఎన్నికల్లో చెప్పిన పవన్ కళ్యాణ్ నేడు కనీసం స్పందించడంలేదు. చట్ట ప్రకారం హామీ ఇచ్చిన పరిశ్రమలే రాకపోతే తన పార్టీ వెనక వున్న అత్యధిక యువత ఎలా బతుకుతారు? కడప ఉక్కు పరిశ్రమ పట్ల కేంద్ర బిజెపి నయవంచన వైఖరికి నిరసనగా సిపిఎం జులై 31న రాయలసీమ జిల్లాల కలెక్టర్ కార్యాలయాల దగ్గర ఆందోళనలు చేసింది. కలిసివచ్చే పార్టీలు, వ్యక్తులు, ముఖ్యంగా యువతను కలుపుకొని ఉద్యమించడానికి పిలుపునిచ్చింది.

వి. రాంభూపాల్

రాయలసీమకు బిజెపి ద్రోహం

రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదు కాదు పది సంవత్సరాలు కావాలని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని అన్ని అంశాలను అమలు పరుస్తామని బిజెపి హామీ ఇచ్చింది. 2014 రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా కడపలో ఉక్కు పరిశ్రమ, అనంతపురంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసెన్ పరిశ్రమలు, టెక్స్‌టైల్ పార్క్, కర్నూలులో రూ.400 కోట్లతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి), రైల్వే కోచ్ నిర్మాణ పరిశ్రమ, తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై-విశాఖ పారిశ్రామిక కారిడార్ నిర్మాణం పది సంవత్సరాల్లో పూర్తి చేయాలి. విభజన చట్టం రూపొందించి పది సంవత్సరాలు పూర్తయింది కాని ఒక్క హామీ పూర్తిగా అమలు కాలేదు. గత తొమ్మిది సంవత్సరాలుగా బిజెపినే దేశాన్ని పాలిస్తున్నది.

విభజన చట్టం ప్రకారం కడప ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలో నిర్మించాలి. కాని బిజెపి మొదటి నుండి ఈ పరిశ్రమ స్థాపనపై మోసపూరిత వైఖరి అనుసరిస్తున్నది. పరిశ్రమ నిర్మాణానికి అవసరమైన పర్యావరణ అనుమతులను ఏడు సంవత్సరాల తర్వాత మంజూరు చేసింది. ఆ తర్వాత కొద్దికాలానికే ఇక్కడ పరిశ్రమ నిర్వహణకు నాణ్యమైన ఖనిజాలు వున్నాయా అంటూ అనుమానాలు లేవనెత్తింది. దీనిపై సెయిల్ సంస్థతో అధ్యయన బృందాన్ని నియమించింది. పార్లమెంట్‌లో మన రాష్ట్ర ఎంపీలు ప్రశ్నించిన ప్రతిసారి విభిన్న ప్రకటనలు చేసింది. పరిశ్రమ నిర్మాణం చేపట్టి తీరుతామని, అధ్యయనం చేస్తున్నామని, ప్రభుత్వ రంగంలో నిర్మాణం సాధ్యం కాదని ఇలా అనేక వాదనలు చేసింది. మరోవైపు రాష్ట్ర బిజెపి పార్టీ తరపున కర్నూలులో రాయలసీమ డిక్లరేషన్, కడపలో రాయలసీమ రణభేరి అంటూ సభలు జరిపి మాటల గారడి చేసింది. రాయలసీమ డిక్లరేషన్‌కు బిజెపి కట్టుబడి వుందని, కడప ఉక్కు అందులో భాగమని రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షురాలు నాలుగు రోజుల క్రితమే ప్రకటించారు. ఆ తర్వాత మూడు రోజులకే కడప ఉక్కు పరిశ్రమ లాభదాయకం కాదని కేంద్ర ప్రభుత్వం చావు కబురు చల్లగా చెప్పింది.

రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు తమ అదుపాజ్ఞల్లో వున్నాయి కాబట్టే రాష్ట్ర హామీలను అమలు చేయకపోయినా, కడప ఉక్కు పరిశ్రమను నిర్మించకపోయినా తనను అడిగేవారు లేరన్నది బిజెపి వైఖరి. మాటల గారడీ చేస్తూ ప్రజలను మోసగించడం, మత ఘర్షణలు సృష్టిస్తూ ప్రజలను చీల్చడం ద్వారా కొంత కాలం గెలవొచ్చు. కాని ఉక్కు పరిశ్రమ కోసం ప్రాణ త్యాగం చేసిన చరిత్ర ఆంధ్రులదని విస్మరించకూడదు. పాలక పార్టీలు రాజకీయ తెరల చాటున ఆడుతున్న ఈ వికృత విషాదకర నాటకం చివరి అంకానికి వచ్చింది. ఆంధ్రుల పక్షాన వుంటారా, ఆంధ్రులను దగా చేస్తున్న బిజెపి పక్షాన వుంటారా అని ప్రశ్నించే సమయం రానే వచ్చింది. కడప ఉక్కు కోసం ఉద్యమించకుండా రాయలసీమ బిడ్డలమని చెప్పుకునే అర్హతను పాలక, ప్రతిపక్ష నేతలు కోల్పోతారు.

ఆంధ్రప్రదేశ్‌కు...అందులో భాగంగా రాయలసీమ ప్రజలకు... తీరని ద్రోహం చేస్తున్న బిజెపిపై పోరాడాల్సిన వైసిపి, టిడిపిలు ఆ పార్టీని ప్రసన్నం చేసుకోవడం కోసం పోటీలు పడుతున్నాయి. బిజెపి వినాశకర విధానాలకు మద్దతు ఇస్తున్నాయి.

నాలుగు శంకుస్థాపనలు

కడప ఉక్కు పరిశ్రమ రాయలసీమ ప్రజల చిరకాల కాంక్ష. ఈ ప్రాంతం కరువు సీమే అయినప్పటికీ, ఖనిజ సంపద నిండిన ప్రాంతం. ఈ భూగర్భంలో 64 రకాల ఖనిజ నిక్షేపాలు వున్నాయి. సున్నపురాయి మొదలు విలువైన ఇనుము, అత్యంత విలువైన డోలమైట్, బంగారం, వజ్రాలు ఈ నేలలో వున్నాయి. ప్రపంచంలోనే అత్యంత అరుదైన పులరిన్ ఖనిజంతో పాటు విలువైన ఔషధ మొక్కలు అనేకం ఇక్కడ వున్నాయి. వీటి ఆధారంగా పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించి, కరువు నుండి శాశ్వత విముక్తి చేయాలనేది ఇక్కడి ప్రజల కోరిక. ఈ ప్రాంతం నుండి గెలిచిన నేతలే రాష్ట్రాన్ని అత్యధిక కాలం పరిపాలించారు, పరిపాలిస్తున్నారు. కడపలో ఉక్కు పరిశ్రమను స్థాపించి లక్ష మందికి ఉపాధి కల్పిస్తామంటూ నేతలు హామీలు గుప్పించి 16 సంవత్సరాల్లో నాలుగుసార్లు శంకుస్థాపనలు చేశారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా 2007లో జమ్ములమడుగు వద్ద బ్రాహ్మణీ స్టీల్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. 20 వేల కోట్ల పెట్టుబడితో, 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో 10,060 ఎకరాల్లో స్థాపించే ఈ పరిశ్రమ ద్వారా లక్ష మంది యువతకు ఉపాధి వస్తుందన్నారు. ఆ తర్వాత దాదాపు పుష్కరకాలం అది శిలాఫలకానికే పరిమితమైంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కడప ఉక్కు పరిశ్రమ మరలా చర్చనీయాంశమైంది. విభజన చట్టంలో భాగమైంది. ఈ హామీ అమలు చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వానికి, దాన్ని సాధించుకోవాలని నాటి తెలుగుదేశం ప్రభుత్వానికి గుర్తుకు రాలేదు. ఈ రెండు పార్టీల మధ్య మిత్రబంధం చెడిన తర్వాత 2018 జూన్ 18న టిడిపి ఎంపీ సి.ఎం.రమేష్ కడపలో ఉక్కు పరిశ్రమ కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టడం, ఆ తర్వాత ఎన్నికలకు ఐదు నెలల ముందు 2018 డిసెంబర్‌లో గండికోటకు దగ్గరలోని కంబులదిన్నె గ్రామం వద్ద చంద్రబాబు నాయుడు 'రాయలసీమ స్టీల్ అథారిటీ కార్పొరేషన్ లిమిటెడ్' పేరుతో శంకుస్థాపన చేయడం నాటకీయంగా జరిగింది. నేడు బిజెపిలో ఉన్న సి.ఎం రమేష్ దీనిపై నోరెత్తడం లేదు.

ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ఈ ఉక్కు పరిశ్రమకు మరో రెండు సార్లు శంకుస్థాపనలు చేసింది. విభజన చట్టంలో భాగంగా వున్న కడప ఉక్కు సాధించడానికి కేంద్రంపై ఒత్తిడి తేవలసిందిపోయి రాయలసీమ ప్రజల దృష్టిని మళ్ళించడానికి శంకుస్థాపనలు మొదలుపెట్టింది. 2019లో ఆంధ్రప్రదేశ్ హైగ్రేడ్ స్టీల్‌ప్లాంట్ పేరుతో ఒకసారి, 2023లో జెఎస్‌డబ్ల్యు (జిందాల్) కంపెనీతో పేరుతో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వ రంగానికి లాభదాయకం కాని కడప ఉక్కు పరిశ్రమ జిందాల్ కంపెనీకి ఎలా లాభదాయకమవుతుంది?

రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు తమ అదుపాజ్ఞల్లో వున్నాయి కాబట్టే రాష్ట్ర హామీలను అమలు చేయకపోయినా, కడప ఉక్కు పరిశ్రమను నిర్మించకపోయినా తనను అడిగేవారు లేరన్నది బిజెపి వైఖరి. మాటల గారడీ చేస్తూ ప్రజలను మోసగించడం, మత ఘర్షణలు సృష్టిస్తూ ప్రజలను చీల్చడం ద్వారా కొంత కాలం గెలవొచ్చు. కాని ఉక్కు పరిశ్రమ కోసం ప్రాణ త్యాగం చేసిన చరిత్ర ఆంధ్రులదని విస్మరించరాదు. నాడు కేంద్రం అధికార మదంతో ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తే పోరాడి పునర్నిర్మించుకున్న ఘనత ఆంధ్రులది. పాలకపార్టీలు రాజకీయ తెరల చాటున ఆడుతున్న ఈ వికృత విషాదకర నాటకం చివరి అంకానికి వచ్చింది. ఆంధ్రుల పక్షాన వుంటారా, ఆంధ్రులను దగా చేస్తున్న బిజెపి పక్షాన వుంటారా అని ప్రశ్నించే సమయం రానే వచ్చింది. కడప ఉక్కు కోసం ఉద్యమించకుండా రాయలసీమ బిడ్డలమని చెప్పుకునే అర్హతను పాలక, ప్రతిపక్ష నేతలు కోల్పోతారు.

(వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు)

జవాబుదారీతనం లేని ప్రధాని

వ్యాఖ్య

దాదాపు గత మూడు మాసాలుగా జాతీయ రాజకీయ పరిణామాల్లో తీవ్ర చర్చనీయాంశంగా ఉన్న మణిపూర్ ఘటనలు నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలన ఎంత ముదనష్టంగా వుందో కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నాయి. ఈ నిరంకుశ ప్రభుత్వం ఎవరికీ జవాబుదారీ వహించడం లేదు. జాతులు, తెగల మధ్య హింసాకాండతో మణిపూర్ అట్టుడుకుతోంది. ఇంతవరకు 150 మందికి పైగా చనిపోయారు. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ముఖ్యంగా మహిళలపై భీతిగొలిపే రీతిలో నేరాలు జరుగుతున్నాయి. ఈ పరిణామాలను యావద్దేశం తీవ్ర ఆందోళనతో తిలకిస్తున్నది. అడ్డు అదుపు లేకుండా సాగుతున్న ఈ హింసను అరికట్టి, శాంతిని తిరిగి నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని ఎవరైనా ఆశిస్తారు. వాస్తవంగా అక్కడ జరుగుతున్నది ఎవరూ ఊహించనిది. సున్నితమైన ఈ ఈశాన్య రాష్ట్రంలో చెలరేగుతున్న విషాదాన్ని గురించి మాట్లాడేందుకు దేశ ప్రధాని మొండిగా తిరస్కరిస్తున్నారు. డబుల్ ఇంజను ప్రభుత్వం (కేంద్ర రాష్ట్రాల్లో రెండు చోట్లా బిజెపి ప్రభుత్వాలే వున్నాయి) ప్రధానిగా, మణిపూర్‌లో జరుగుతున్న నరమేధానికి ఎలాంటి జవాబుదారీ వహించడం లేదు.

సాయుధులైన మెయితీ పురుషులు ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, అందునా పార్లమెంట్ సమావేశాల ప్రారంభ సమయం కావడంతో ప్రధాని మోడీ మణిపూర్‌పై నోరు విప్పక తప్పని పరిస్థితి ఏర్పడింది. అది కూడా పార్లమెంట్ వెలుపల మాట్లాడారు. ఆ ఇద్దరు మహిళలకు జరిగిన దాని పట్ల దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. కానీ ఆ వెంటనే, మహిళలపై ఇటువంటి నేరాలు జరిగినపుడు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో కఠినంగా అణచివేయాలంటూ సమస్యను పక్కదారి పట్టించే యత్నం చేశారు. రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరిగే దాడులు, నేరాల విషయాన్ని ప్రస్తావించాలని తన పార్టీ నేతలకు, పార్టీ అధీనంలోని ఐటి విభాగానికి ఆయన ఈ విధంగా ఒక సంకేతమిచ్చినట్లైంది.

అడ్డు అదుపు లేకుండా సాగుతున్న ఈ హింసను అరికట్టి, శాంతిని తిరిగి నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని ఎవరైనా ఆశిస్తారు. వాస్తవంగా అక్కడ జరుగుతున్నది ఎవరూ ఊహించనిది. సున్నితమైన ఈ ఈశాన్య రాష్ట్రంలో చెలరేగుతున్న విషాదాన్ని గురించి మాట్లాడేందుకు దేశ ప్రధాని మొండిగా తిరస్కరిస్తున్నారు. డబుల్ ఇంజను ప్రభుత్వం (కేంద్ర రాష్ట్రాల్లో రెండు చోట్లా బిజెపి ప్రభుత్వాలే వున్నాయి) ప్రధానిగా, మణిపూర్‌లో జరుగుతున్న నరమేధానికి ఎలాంటి జవాబుదారీ వహించడం లేదు.

మణిపూర్‌లో తలెత్తిన పరిస్థితుల తీవ్రతను ప్రధాని, బిజెపి గుర్తించ నిరాకరించే ఈ ధోరణి ఒక మానసికోన్మత్తత నుంచి వచ్చిందే తప్ప మరొకటి కాదు. మహిళలపై దాడులు ఏ రాష్ట్రంలో జరిగినా వాటిని నిర్దిష్ట నేరాలుగానే చూడాలి. మణిపూర్‌లో పరిస్థితి అలాంటిది కాదు. ఇక్కడ, ఒక ప్రత్యేక తెగకు చెందిన మహిళలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి. వారు ఆ కమ్యూనిటీకి చెందడమే నేరం అన్నట్టుగా ఉంది. కుకీ మహిళలపై జరుగుతున్న హింస, అకృత్యాలన్నీ ముందస్తు పథకం ప్రకారం జరిగినవే. ఫాసిస్టు ఆరెస్సెస్ ప్రవచించే జాతుల ప్రక్షాళనా కార్యక్రమంలో భాగమే ఇదంతా. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న ఘటనలతో మణిపూర్ ఘటనలను ప్రధాని పోల్చడమే తప్పు.

మణిపూర్ పరిస్థితులపై ప్రధాని ఒక ప్రకటన చేయాలంటూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్ అత్యంత సముచితమైనది. ప్రధానిగా, ఆయన పార్లమెంట్‌కు వచ్చి కీలకమైన మణిపూర్‌పై ఒక ప్రకటన చేయాల్సి వుంది. ప్రధాని, పార్లమెంటుకు జవాబుదారీ అన్న మౌలిక సూత్రాన్ని సైతం ఆయన గుర్తించడం లేదు. అందుకే, ప్రధాని, పాలక పార్టీ ఇటువంటి ప్రకటన చేయడానికి ససేమిరా అంటున్నాయి. అలా ప్రకటన చేసినట్లైతే ఉభయసభల్లోనూ చర్చకు అది ఒక ప్రాతిపదికగా ఉంటుంది. అందుకు ప్రధాని తిరస్కరిస్తుండడం వల్లే అది పార్లమెంటులో ప్రతిష్టంభనకు దారితీసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం నుండీ ఇదే పరిస్థితి.

హిందూత్వ-నిరంకుశ ప్రభుత్వ స్వభావాన్ని సరిగా గ్రహించలేకపోతే, మణిపూర్‌పై ప్రధాని మాట్లాడడానికి, పార్లమెంటుకు జవాబుదారీ వహించడానికి ఎందుకు తిరస్కరిస్తున్నారో అర్థం చేసుకోలేరు. మణిపూర్‌లో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కుకీ గిరిజన మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని మెయితీలలో మత దురహంకారాన్ని రెచ్చగొడుతున్నారు, కుకీ కమ్యూనిటీకి బహిరంగంగానే వ్యతిరేకంగా మాట్లాడుతూ, వారిని విదేశీయులుగా, గంజాయి సాగుచేసే వారిగా ముద్ర వేశారు. "విదేశీయులైన కుకీ వలసవాదులు సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవహారాలపై ఆధిపత్యం సాధించిన తర్వాత ఆదివాసులైన రాష్ట్ర ప్రజలు రెండో తరగతి పౌరుల స్థాయికి కుదించబడ్డారు." అంటూ మేలో ఈ అల్లర్లు తలెత్తడానికి కేవలం ఒక నెల రోజుల ముందే ముఖ్యమంత్రి ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక అయిన ఆర్గనైజర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అస్సాం, ఈశాన్య ప్రాంతాల నుండి అక్రమంగా వలసవాదులు వెల్లువెత్తారన్న ఆర్‌ఎస్‌ఎస్ సుదీర్ఘకాల ప్రచారాన్నే ఆయన కూడా పునరుద్ఘాటించారు.

సందర్భం

మెయితీ తీవ్రవాద సంస్థ అయిన ఆరంబై తెంగోల్‌ను బీరేన్ సింగ్ ప్రోత్సహిస్తున్నారు. ఈ సంస్థకి చెందిన వారే లోయలో కుకీ మహిళలపై, ఇళ్ళపై జరిగే దాడుల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. దాడులు, ప్రతి దాడులతో మెయితీ, కుకీ కమ్యూనిటీలకు చెందినవారు బాధితులుగా మారుతున్నారు. జాతుల మధ్య హింసను ప్రేరేపించడంలో బీరేన్‌సింగ్ చేసిన నేరం ఇది. నరేంద్ర మోడీ, బిజెపి ఈ అంశాన్ని కప్పిపుచ్చాలని చూస్తున్నాయి. ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం రాజీ పడ్డారని, వారు నిష్పాక్షికంగా వ్యవహరించలేకపోతున్నారని, పరిస్థితిని అదుపుచేయలేక పోతున్నారని తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వమే పరిస్థితిని అదుపుచేయగలదనే రీతిలో కేంద్ర ప్రభుత్వం మాట్లాడుతోంది.

2002 అల్లర్లు, హింసాకాండ సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్నపుడు నరేంద్ర మోడీ ఏ రీతిన వ్యవహరించారో, అదే రీతిలో బీరేన్‌సింగ్ కూడా వ్యవహరిస్తున్నారు. మణిపూర్‌లో ప్రస్తుత పరిస్థితులకు మూల కారణమేమిటనేదీ మోడీకి బాగా తెలుసు-జాతుల పరంగా వైవిధ్యభరితమైన, సున్నితమైన రాష్ట్రంలో విచ్ఛిన్నకర హిందూత్వ రాజకీయాలే దీనికి కారణం-అనే విషయం నిరంకుశ నేతగా మోడీ తానెవరికీ చివరకు పార్లమెంట్‌కు సైతం జవాబుదారీ వహించాలని అనుకోవడం లేదు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. చర్చ ద్వారా మణిపూర్‌లో పరిస్థితిని ప్రముఖంగా ప్రస్తావించడానికి, ఆ చర్చకు స్పందించేలా మోడీ మెడలు వంచడానికి ఇదొక్కటే మార్గం.

(పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయం)

అమ్మ పాలు అమృతం

సందర్భం

మన దేశంలో ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు జరుగుతాయి. శిశువుకు ప్రకృతి ఇచ్చే సహజ సిద్ధమైన టీకా వంటివి. శిశువుకు తల్లి పాలకు మించిన ఆహారం లేదు. వీటిలో ప్రోటీన్లు, విటమిన్లు, పిండిపదార్థాలు, కాల్షియం, పొటాషియం, ఖనిజాలు, సూక్ష్మ పోషకాలు అవసరమైన మేరకు పుష్కలంగా ఉండడం వలన పిల్లలు తగినంత బరువు పెరుగుతారు. అంటువ్యాధులు, వైరల్ ఇన్ఫెక్షన్లు, అలర్జీలు, ఆస్తమా, చెవి సంబంధిత వ్యాధులు, న్యుమోనియా, డయేరియాల నుండి శిశువును కాపాడుతాయి. వీటిలోని ఫాటీ యాసిడ్లు బిడ్డ మెదడు పెరుగుదలకు దోహదం చేయడం వలన తెలివితేటలు పెరుగుతాయి. తేలికగా జీర్ణమవడం వలన మలబద్ధక సమస్యలు రాకుండా కాపాడతాయి. భవిష్యత్తులో స్థూలకాయం, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధి రాకుండా కాపాడతాయి. ప్రసవం అయిన వెంటనే మొదటి అరగంట నుండి ఒక గంట వ్యవధిలో తల్లి పాలలో కోలాస్ట్రం ఉంటుంది. ఈ పాలు ఎంత తొందరగా తాగించడం మొదలుపెడితే అంత మంచిది. శిశువు జీవితంలోని మొదటి నెలలకు అవసరమైన శక్తిని, పోషకాలను తల్లి పాలు అందిస్తాయి. బిడ్డకు ఆరు నెలలు పూర్తయ్యేవరకూ తల్లి పాలు మాత్రమే పట్టాలి. ఈ ఆరు నెలలు చాలా కీలకం. తల్లి పాలల్లో ఎనభై శాతం కంటే ఎక్కువ నీరు ఉంటుంది. తల్లి తన బిడ్డకు దాహం వేస్తున్నట్లు అనిపించినప్పుడల్లా పాలివ్వవచ్చు. వేడి వాతావరణంలో కూడా ఆరు నెలల వయస్సు లోపు పిల్లలకు నీరు అవసరం లేదు. ఆరు నెలల తరువాత తల్లి పాలతో పాటు పరిపూర్ణమైన ఆహారాన్ని అందించడం మొదలు పెట్టవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది. డాక్టర్ సలహా మేరకు విటమిన్లు, మినరల్స్, సిరప్‌లు ఇవ్వొచ్చు. అదనపు ఆహారంతోపాటు కనీసం రెండేళ్ల తల్లి పాలు పట్టాలి. తల్లికి, పాలు తాగే బిడ్డకు ఎలాంటి సమస్య రానంత వరకూ, తల్లి మరల గర్భంతో ఉన్నా కూడా బిడ్డకు పాలు ఇవ్వవచ్చు. ఆ తరువాత తల్లీ బిడ్డలకు ఇష్టమైనంతవరకూ తల్లి పాలు పట్టవచ్చు.

- డి.జె. మోహనరావు,
సెల్ : 9440485824

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

ఆగని మణిపూర్ ప్రకంపనలు

గందరగోళం మధ్య ఉభయ సభల్లో మూడేసి బిల్లులు ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్ మారణహోమంపై పార్లమెంటులో ప్రకంపనలు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం పార్లమెంటు ఉభయసభలు వాయిదాల పర్వం తొక్కాయి. హింసాత్మక మణిపూర్ పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటులో ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన ప్రతిపక్షాల ఆందోళనతో ఉభయ సభలు దద్దరిల్లాయి. ఈ గందరగోళం నడుమే, సమగ్ర చర్చ లేకుండా ఉభయ సభల్లో వేరో మూడు బిల్లులు ఆమోదించుకున్నారు. ఉదయం 11 గంటలకు సభ సమావేశమైన వెంటనే లోక్‌సభ స్పీకరు ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను నిర్వహించేందుకు ప్రయత్నించారు. ప్రతిపక్ష సభ్యులు మణిపూర్ అంశంపై ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు హోరెత్తించారు. దీంతో సభ కేవలం 16 నిమిషాల్లోనే మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన నడుమ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఢిల్లీ పరిపాలన సేవల నియంత్రణ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు సభ వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో జనన మరణాల నమోదు బిల్లు ఆమోదానికి కేంద్ర హోం సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ప్రతిపాదించారు. దీనిపై బిజెపి ఎంపి గుమన్ సింగ్ డమోర్, వైసిపి ఎంపి ఎన్ రెడ్డెప్ప, శివసేన (షిండే) ఎంపి రాహుల్ రమేష్, బిఎస్‌పి ఎంపి సంగీతా ఆజాద్, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసి మాట్లాడిన తరువాత, హోం సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇచ్చారు. ఆ తరవాత బిల్లును ముజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం కేంద్ర గనులశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మినరల్ డవలప్‌మెంట్ సవరణ బిల్లు ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. దీనిపై బిజెపి ఎంపి గోపాల్ చినయ్య శెట్టి, బిజెడి ఎంపి పినాకి మిశ్రా, శివసేన (షిండే) ఎంపి కృపాల్ బాలాజీ, బిఎస్‌పి ఎంపి మలూక్ నగర్ మాట్లాడారు. అనంతరం మంత్రి ప్రహ్లాద్ జోషి సమాధానం ఇచ్చారు. తరువాత బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించు కున్నారు. రాజ్యాంగ (ఎస్‌సి) ఆర్డర్ సవరణ బిల్లును కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ ఆమోదం కోసం సభ ముందుకు తీసుకొచ్చారు. ఈ బిల్లుపై బిజెపి ఎంపి సంధ్యా రాయ్, వైసిపి ఎంపి జి మాధవి, బిఎస్‌పి ఎంపి సంగీతా ఆజాద్ మాట్లాడిన తరువాత కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. అనంతరం బిల్లును ముజువాణి ఓటుతో ఆమోదించారు. తరువాత సభను బుధవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్

రాజ్యసభలోనూ అదే సీను పునరావృతమైంది. రాజ్యసభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు తమ ఆందోళన కొనసాగించాయి. మణిపూర్‌పై చర్చ కోసం రూల్ 267 కింద ప్రతిపక్షాలు ఇచ్చిన 60 నోటీసులను రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తిరస్కరించారు. అధికార పార్టీ సభ్యులు ఇచ్చిన రూల్ 176 కింద నోటీసులను ఆమోదించారు. ప్రతిపక్షాలు నినాదాలతో ఆందోళన చేపట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు ఆందోళన మధ్యే ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ఛైర్మన్ ధన్‌ఖర్ ప్రయత్నించారు. మణిపూర్ సంక్షోభంపై ప్రధాని మోడీచేసిన ప్రకటనకు పదే పదే డిమాండ్ చేసినా పట్టించుకోకపోవడంతో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

ఈ సందర్భంగా ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. మణిపూర్ అంశంపై ప్రధాని చర్చించడం లేదని, తాము 11 రోజుల నుండి ఎదురుచూస్తున్నామని అన్నారు. సభలో ప్రభుత్వం ప్రతిపక్షాలను మాట్లాడనివ్వడం లేదని అన్నారు. ప్రశ్నోత్తరాలు అనంతరం సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు.

తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే, కేంద్ర న్యాయశాఖ మంత్రి అడ్వకేట్ సవరణ బిల్లును, కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ పిరియాడికల్స్ బిల్లును ప్రవేశపెట్టారు. కేంద్ర సహకారశాఖ సహాయ మంత్రి బిఎల్ వర్మ మల్టీ స్టేట్ కో ఆపరేటివ్ సొసైటీ సవరణ బిల్లును ఆమోదం కోసం ప్రతిపాదించారు. దీనిపై బిజెడి ఎంపి నిరంజన్ బిషీ, వైసిపి ఎంపిలు వి విజయసాయి రెడ్డి, నిరంజన్ రెడ్డి, బిజెపి ఎంపిలు అనిల్ సుఖ్‌దేవ్‌రావు, విజయ్ పాల్ సింగ్ తోమర్, కైలాష్ సోని, ధనంజయ్ భీరావు మహదిక్, నరహరి అమిన్, మిథలేష్ కుమార్, అన్నాడిఎంకె ఎంపి తంబిదొరై, టిఎంసిఎం ఎంపి జికె వాసన్, కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా మాట్లాడారు. అనంతరం కేంద్ర మంత్రి బిఎల్ వర్మ సమాధానం ఇచ్చిన తరువాత, బిల్లును ముజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు. అనంతరం మధ్యవర్తిత్వ సవరణ బిల్లును ఆమోదం కోసం కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రస్తావించారు. దీనిపై బిజెడి ఎంపి అమర్ పట్నాయక్, బిజెపి ఎంపిలు భువనేశ్వర్ కలిట, ఎస్ ఫాంగ్నోన్ కొన్యాక్, రాకేష్ సిన్హా సుధాన్ష త్రివేది, వైసిపి ఎంపిలు నిరంజన్ రెడ్డి, వి విజయసాయి రెడ్డి, టిఎంసిఎం ఎంపి జికె వాసన్, బిఎస్‌పి ఎంపి రామ్‌జీ మాట్లాడిన తరువాత, కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. అనంతరం బిల్లును ముజువాణి ఓటుతో ఆమోదించారు.

తరువాత కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ జీవ వైవిధ్య సవరణ బిల్లును ఆమోదం కోసం ప్రతిపాదించారు. ఈ బిల్లుపై బిజెడి ఎంపి సులతా డియో, భువనేశ్వర్ కలిట, బ్రిజ్‌లాల్, వైసిపి ఎంపిలు అయోధ్య రామిరెడ్డి, వి విజయసాయి రెడ్డి, తమిళ మాణిల కాంగ్రెస్ ఎంపి జికె వాసన్, బిఎస్‌పి ఎంపి రామ్‌జీ మాట్లాడిన, అనంతరం కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. తరువాత బిల్లును ముజువాణి ఓటుతో ఆమోదించి, సభను నేటి బుధవారానికి వాయిదా వేశారు.

'వివేకా' హత్య కేసులో తులసమ్మ అప్లికేషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ దాఖలు చేసిన మిస్‌లీనియస్ అప్లికేషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. ఈ అప్లికేషన్‌ను మంగళవారం జస్టిస్ సిటి రవికుమార్, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. వాదనలు వినిపించడానికి సమయం కావాలని ఇరుపక్షాల న్యాయవాదులు కోరడంతో ధర్మాసనం తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది.

ప్రతిపక్షాల వ్యతిరేకత మధ్య లోక్‌సభలో ఢిల్లీ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

అనుమతించాలని స్పీకరును అమిత్ షా కోరారు. ఈ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమంటూ ప్రతిపక్షాలు పెద్దఎత్తున చేసిన నినాదాల మధ్య ఆయన సభలో బిల్లు ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో స్పీకరు ఓం బిర్లా బిల్లు ప్రవేశానికి ఆమోదం లభించినట్లు ప్రకటించారు.

బిల్లులో ఏముంది?

ఢిల్లీ ప్రభుత్వంలోని సీనియర్ అధికారుల బదిలీలు, పోస్టింగుల కోసం జారీ చేసిన ఆర్డినెన్స్‌కు బదులుగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (సవరణ) బిల్లులో అఖిల భారత సర్వీసులు, కేంద్ర పాలిత డివిజన్ కేడర్ అధికారుల నియామకంపై ఢిల్లీ ప్రభుత్వం కన్నా కేంద్ర ప్రభుత్వానికి ఈ బిల్లు ప్రాధాన్యత నిస్తుంది. మంత్రుల సిఫార్సులను తిరస్కరించే, సవరణలు కోరే అధికారం లెఫ్టినెంట్ గవర్నరుకు కల్పిస్తుంది. ఢిల్లీ ప్రభుత్వంలో సీనియర్ అధికారుల బదిలీలు, పోస్టింగులన్నీ ఢిల్లీ ముఖ్యమంత్రి నేతృత్వంలోని త్రిసభ్య కమిటీచే చేయబడుతుంది. ఢిల్లీ ముఖ్యమంత్రి నేతృత్వంలోని నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీ సిఫార్సు చేసిన పేర్ల ప్యానెల్ ఆధారంగా ఢిల్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డులు, కమిషన్‌లకు లెఫ్టినెంట్ గవర్నరు నియామకాలు చేస్తారని బిల్లులోని కొత్త నిబంధన పేర్కొంది. అయితే ఈ త్రిసభ్య కమిటీలో ఢిల్లీ సిఎంతో పాటు కేంద్ర ప్రభుత్వం నియమించే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ చేసిన సిఫార్సులపై లెఫ్టినెంట్ గవర్నరుదే అంతి మ నిర్ణయం. అంటే ఇక్కడ ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వానికి, అసెంబ్లీకి ఎటువంటి అధికారాలు ఉండవు.

ఆర్డినెన్స్‌లోని కొన్ని అంశాలు బిల్లులో తొలగింపు

ఆర్డినెన్స్‌లోని కొన్ని అంశాలు ఈ బిల్లులో తొలగించారు. 'సేవల'పై ఎటువంటి చట్టాన్ని రూపొందించడంలో రాష్ట్ర అసెంబ్లీ పాత్ర లేదని ఆర్డినెన్స్‌లో పేర్కొన్న నిబంధనను బిల్లులో తొలగించారు. ఢిల్లీ ప్రభుత్వం వార్షిక నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి అందజేయాలని ఆర్డినెన్స్ కింద నిర్దేశించిన అవసరాన్ని బిల్లులో తొలగించారు. 'ప్రతిపాదనలు, అంశాలకు సంబంధించిన మంత్రుల ఆదేశాలను లెఫ్టినెంట్ గవర్నరు, ఢిల్లీ ముఖ్యమంత్రి ముందు కేంద్ర ప్రభుత్వానికి రిఫర్ చేయాల్సిన అవసరం ఉంది' అనే నిబంధనను కూడా తొలగించారు. న్యాయ పరిశీలనలో బిల్లు నెగ్గాలంటే, ఆర్డినెన్స్‌లోని ఈ తొలగింపులు తప్పనిసరి అని భావించి తొలగించారు.

రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలాయి

(మొదటి పేజీ తరువాయి)

న్యాయవాది తెలిపారు. ఒక మహిళను సజీవంగా దహనం చేసిన ఘటనపై ఎఫ్ఐఆర్ 12వ స్థానంలో వుందని దాన్ని సిబిఐకి అప్పగించలేదని మరో న్యాయవాది జైదీప్ గుప్తా తెలిపారు.

అరకొర వివరాలతో స్టేటస్‌కో రిపోర్టు

యథాతథ స్థితిపై నివేదిక (స్టేటస్‌కో రిపోర్టు)లో రాష్ట్ర ప్రభుత్వం అందచేసిన సమాచారం అసమగ్రంగాను, అరకొరగాను వుందని కోర్టు పేర్కొంది. ఎఫ్ఐఆర్‌లను వివిధ అంశాలవారీగా విడగొట్టి ఇవ్వడంలోను అలసత్వం ప్రదర్శించారని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ఈ కేసుల్లో హత్యలు లేదా అత్యాచారాలు ఎన్ని, లూటీలు, దహనాలకు సంబంధించినవెన్ని,ఆరాధనా స్థలా విధ్వంసానికి సంబంధించినవెన్ని వంటి వివరాలు ఏవీ ఈ నివేదికలో లేవని అన్నారు.

ప్రధాని కార్యక్రమానికి పవార్

పుణె: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'లోక్‌మాన్య తిలక్ జాతీయ పురస్కారం' అందుకున్నారు. 'ది తిలక్ స్మారక్ మందిర్ ట్రస్ట్' ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోడీ.. ఇవి తనకు గుర్తుండిపోయే క్షణాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ప్రధాని మోడీని ఆప్యాయంగా పలకరించారు. విపక్షాల కూటమి మూడో విడత సమావేశం త్వరలో మహారాష్ట్రలో జరగనున్న నేపథ్యంలో ఆ కూటమి నుంచి వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ.. ప్రధాని మోడీతో పవార్ వేదికను పంచుకోవడం గమనార్హం. విపక్షాలన్నీ ఏకమై బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సమయంలోనే ప్రధాని మోడీతో పవార్ వేదిక పంచుకోవడం మంచి పరిణామం కాదని 'ఇండియా' కూటమి సభ్యులు పేర్కొన్నారు. ఆ కార్యక్రమానికి వెళ్లొద్దని చెప్పడానికి ప్రయత్నించిన కొందరు ఎంపీలనూ పవార్ కలవకపోవడం గమనార్హం. మణిపుర్ సమస్య సహా అనేక విషయాల్లో పాలక, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న తరుణంలో తాజా పరిణామం కీలకంగా మారింది. బిజెపి పట్ల అత్యంత కఠినంగా ఉండాల్సిన శరద్ పవార్.. ఏకంగా మోడీ పాల్గొన్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెళ్లడం, ఆయనతో సన్నిహితంగా మెలగడం విపక్షాలకు మింగుడుపడటం లేదు. దీన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం) సభ్యులు.. మోడీ సందర్శించిన దగడూసేఠ్ గణేష్ ఆలయానికి కొంత దూరంలో నిరసన వ్యక్తం చేశారు.

దేశంలో తొలి డిజిటల్ సైన్స్ పార్క్ ప్రారంభం

తిరువనంతపురం : ఇప్పటికే దేశంలో మోడల్ రాష్ట్రంగా గుర్తింపు పొందిన కేరళ.. తాజాగా మరో ఘనతను సాధించింది. దేశంలో మొట్టమొదటి డిజిటల్ సైన్స్ పార్క్‌ను బుధవారం ప్రారంభించింది. ముఖ్య మంత్రి పినరయి విజయన్ ఈ పార్క్‌ను ప్రారంభించారు. ఈ పార్క్ కోసం టెక్నో పార్క్ ఫేజ్-4లో సుమారు 14 ఎకరాలను కేటాయించారు. అలాగే ఈ పార్క్ కోసం కెఐఐఎఫ్‌బి నుంచి 200 కోట్లను కేరళ ప్రభుత్వం కేటాయించింది. దీని మొత్తం అంచనా విలువ రూ. 1,515 కోట్లు. ఈ ఏడాది ఏప్రిల్ 5న దీనికి శంకుస్థాపన జరిగింది. కేవలం మూడు నెలల వ్యవధిలోనే డిజిటల్ సైన్స్ పార్క్‌కు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయడం విశేషం. వచ్చే ఏడాదిన్నర లేదా రెండు ఏళ్లలో 2,50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు భవనాలను ఇక్కడ నిర్మిస్తారు. దీంతో పార్క్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది. 33 ఏళ్ల క్రితం ఈకే నాయనార్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో దేశంలోనే తొలి టెక్నో పార్క్‌ను కేరళలో ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం దేశంలో తొలి డిజిటల్ వర్శిటీని ప్రారంభించి దేశం మొత్తానికి ఐటి రంగంలో కేరళ రోల్ మోడల్‌గా నిలిచింది.

నెతన్యాహు న్యాయ సంస్కరణలపై సుప్రీం సంపూర్ణ ధర్మాసనం విచారణ

జెరూసలేం : న్యాయ సంస్కరణల పేరుతో బెంజిమిన్ నెతన్యాహు ప్రభుత్వం పార్లమెంటులో ఇటీవల ఆమోదింపజేసుకున్న బిల్లును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టుకు చెందిన 15మంది న్యాయమూర్తులతో కూడిన సంపూర్ణ ధర్మాసనం విచారణ చేపడుతుందని ఆ దేశ సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తెలిపింది. ఇదొక చారిత్రక నిర్ణయమని మీడియా వ్యాఖ్యానించింది.న్యాయస్థానానికి గల అధికారాలను కబళించే వివాదాస్పద బిల్లును గత వారం పార్లమెంటులో నెతన్యాము ఆమోదింపజేసుకున్నారు. ఆ బిల్లును కొట్టివేయాలంటూ తామరతం పరగా పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని విచారించేందుకు ఉన్నత న్యాయస్థానం అంగీకరించింది. విస్తృత ధర్మాసనం ఇలా విచారించడం దేశ చరిత్రలోనే ప్రథమమని కోర్టు ప్రతినిధి వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థపై దాడి చేసేలా నెతన్యాహు ప్రభుత్వం చేపట్టిన చర్యలు దేశంలో కనివినీ ఎరుగని రీతిలో సంక్షోభాన్ని సృష్టించాయి. దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింది. పార్లమెంట్‌లోని 120సీట్ల లో నెతన్యాహు సంకీర్ణానికి 64సీట్లు వున్నాయి. ప్రభుత్వం తలపెట్టిన మార్పులను గనక ఆమోదిస్తే ప్రజాస్వామ్యం ఖూనీ అయినట్టేనని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇజ్రాయిల్ బార్ అసోసియేషన్ సహా పలువురు పిటిషన్లు వేసిన వారిలో వున్నారు.

ఈ ఏడాది వైజాగ్ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ సాధ్యం కాదు : కేంద్రం

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2023-24లో వైజాగ్ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ సాధ్యం కాదని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి భగవత్ కిషన్‌రావు కరద్ తెలిపారు. రాజ్యసభలో వైసిపి ఎంపి పరిమల్ నత్వానీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా లావాదేవీకి సలహాదారుల నియామక ప్రక్రియ పూర్తయిందని, అయితే ఆసక్తిగల అర్హతగల పార్టీల నుండి ఆసక్తి వ్యక్తీకరణ (ఇఒఐ) ఇంకా జారీ కాలేదని అన్నారు. ఇఒఐ దశ పూర్తయిన తరువాత రెండో దశలో మాత్రమే లావాదేవీల నిబంధనలు, షరతులు ఖరారు చేయబడతాయని అన్నారు. ప్రస్తుతం, ఇఒఐ దశ ఇంకా ప్రారంభించలేదని తెలిపారు.

రూ.950 కోట్ల ఉపాధి హామీ బకాయిలు

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి హామీలో రూ.950 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి నిరంజన్ జ్యోతి తెలిపారు. 2023 జులై 26 నాటికి ఎపిలో ఉపాధి హామీలో వేతనాల బకాయిలు రూ.950 కోట్లు, యంత్రాల బకాయిలు రూ.40 కోట్లు ఉన్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా రూ.6,366 కోట్లు వేతన బకాయిలు, రూ.6,266 కోట్లు యంత్రాల బకాయిలు ఉన్నాయన్నారు.

తెలంగాణ నుంచి విద్యుత్ బకాయిల వసూలుకు చర్యలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.6 వేలకోట్లకు పైగా విద్యుత్ బకాయిలను తెలంగాణ నుంచి వసూలు చేసేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌కె సింగ్ ప్రకటించారు. రాజ్యసభలో వైసిపి ఎంపి వి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు కొంతకాలం సక్రమంగానే ఛార్జీలను చెల్లించిన తెలంగాణ తదనంతరం చెల్లింపులను నిలిపేసిందని తెలిపారు. ఫలితంగా విద్యుత్ ఛార్జీల బకాయిలు రూ.6 వేలకోట్లకు పైగా పేరుకుపోయాయని అన్నారు. ఒక రాష్ట్రం బకాయిలు చెల్లించకుండా మొండికేసిన సందర్భంలో బకాయిల చెల్లింపు కోసం కేంద్రం అనుసరించాల్సిన విధివిధానాలపై మంత్రిత్వ శాఖతోను, ఆర్థిక మంత్రిత్వ శాఖతోను చర్చలు జరుపుతున్నామని అన్నారు. రాష్ట్ర పన్నులలో వాటా కింద తెలంగాణకు ఇచ్చే నిధుల నుంచి ఈ బకాయిల మొత్తాన్ని మినహాయించ వలసిందిగా రిజర్వు బ్యాంక్‌ను కోరే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

ఎపి ప్రభుత్వం రూ.70 వేల కోట్ల రుణాలకు గ్యారెంటీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.79,815 కోట్ల రుణాలు తీసుకునేందుకు గ్యారెంటీ ఇచ్చిందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఎపి ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్ల ద్వారా 2021-22 ఏడాదిలో రూ.22,366.08 కోట్లు, 2022-23 ఏడాదిలో రూ.57,449.55 కోట్లు తీసుకున్న రుణాలకు రాష్ట్ర ప్రభుత్వమే గ్యారెంటీగా ఉందని తెలిపారు.

ఆదాయపు పన్నుశాఖలో 27,564 పోస్టులు ఖాళీ

ఆదాయపు పన్ను శాఖలో 27,564 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 జూన్ 1 నాటికి 1,164 గ్రూప్ ఎ, 464 గ్రూప్ బి (గెజిటెడ్), 25,936 గ్రూప్ బి (నాన్ గెజిటెడ్), గ్రూప్ సి ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

రగిలిన మత చిచ్చు

(మొదటి పేజీ తరువాయి)

చిక్కుకుపోయిన వారిని సాధ్యమైనంత త్వరగా కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గుర్‌గావ్‌లో పరిస్థితి ఆందోళకరంగా ఉంది. నిషేధాజ్ఞలు విధించారు. వాహనాలకు నిప్పంటిస్తున్నారు. దుకాణాలు కొల్లగొడుతున్నారు. తక్షణమే శాంతి భద్రతలను పునరుద్ధరించే చర్యలను చేపట్టాలని ఆ నోటీసులో కోరారు. కీలకమైన ఈ తరుణంలో శాంతి సామరస్యాలను కాపాడేందుకు అందరూ సోదర భావంతో మెలగాలని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రివాల్ కోరారు.

ఎన్‌సి, పిడిపి ఖండన

హర్యానాలో చెలరేగిన మత ఘర్షణలను పిడిపి, నేషనల్ కాన్ఫరెన్స్‌లు మంగళవారం ఖండించాయి. మైనారిటీలపై వరుసగా జరుగుతున్న దాడుల్లో భాగమే ఇవి అని పేర్కొన్నాయి. ఇక్కడొక్క చోటనే జరిగిన ఘటనగా దీన్ని చూడరాదని దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ ముఖ్య ప్రతినిధి సుహైల్ బుఖారి పేర్కొన్నారు. దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ హింసను దురదృష్టకరమైనదిగా నేషనల్ కాన్ఫరెన్స్ ప్రతినిధి ఇమ్రాన్ నబి దర్ వ్యాఖ్యానించారు. ఈ మతోన్మాద ధోరణి దేశంలో పలు ప్రాంతాల్లో చోటు చేసుకుంటోందన్నారు.

సూర్యనారాయణే కీలక సూత్రధారి

- హైకోర్టులో ప్రభుత్వం వాదన

ప్రజాశక్తి-అమరావతి

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగి కెఆర్ సూర్యనారాయణ చేసిన నిర్వాకం వల్ల రూ.124 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. సూర్యనారాయణను విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ తరపున పిపి వై నాగిరెడ్డి పైవిధంగా వాదించారు. ముందస్తు బెయిల్ కూడా ఇవ్వొద్దని కోరారు. ఎసిబి కోర్టు బెయిల్ మంజూరుకు నిరాకరించంతో సూర్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు.తీర్పును రిజర్వులో పెట్టింది.

భారతి సిమెంట్ బ్యాంకు గ్యారెంటీలు తిరిగి ఇచ్చేయాలి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారతి సిమెంట్స్‌కు సంబంధించి బ్యాంకు గ్యారెంటీలు వెంటనే తిరిగి ఇచ్చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఇడి దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఇడి తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు హాజరు కాగా... భారతి సిమెంట్స్‌కు సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉపసంహరించుకున్నారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. మరోసారి ఈ విషయాన్ని సరిచూసుకోవాల్సి ఉందని రాజు సమాధానమిచ్చారు.

ఈ విద్వేష నేరాన్ని ఖండించాలి: సిపిఎం

న్యూఢిల్లీ : ముంబయి వెళుతున్న రైల్లో ఆర్‌పిఎఫ్‌కి చెందిన కానిస్టేబుల్ తన సీనియర్‌ని, మరో ముగ్గురు ప్రయాణికులను కాల్చి చంపిన ఘటనను ఒక వ్యక్తి కలత చెందిన మనస్సుతో చేసిన చర్యలుగా చూడరాదని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. పార్టీ పొలిట్‌బ్యూరో మంగళవారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ, మతి స్థిమితం సరిగా లేని వ్యక్తి జరిపిన కాల్పులుగా అధికారులు తొలుత పేర్కొన్నారు. తరువాత దర్యాప్తునకు ఆదేశించారు. హత్యకు గురైన వారందరూ ముస్లింలే. ఆ కానిస్టేబుల్ ఒక కోచ్ నుండి మరో కోచ్‌లోకి పరిగెడుతూ ముస్లింలనే లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపాడు. ముస్లింలను కించపరుస్తూ, వారికి వ్యతిరేకంగా మతోన్మాద డిక్షనరీలోని పదాలన్నిటిని ఉపయోగిస్తూ అధికారంలో వున్న వారు ప్రతి రోజూ చేసే విద్వేష ప్రసంగాల ప్రత్యక్ష ఫలితమే ఈ కాల్పులు అని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ముస్లింలకు పాకిస్తాన్ నాయకత్వం వహిస్తోందని, వారు భారత్‌లో జీవించాలనుకుంటే మోడీ, యోగీలకు ఓటు వేయాల్సిందేనని ఆ వ్యక్తి ప్రత్యేకంగా పేర్కొంటున్న వీడియో బయటకు వచ్చింది. అయితే ఈ వీడియో విశ్వసనీయమైనదో కాదో నిర్ధారించాల్సి వుంది. బిజెపి నేతలు ఉపయోగించే భాషనే ఆ వ్యక్తి కూడా ఉపయోగించాడు.

విద్వేష ప్రసంగాలెప్పుడూ దేశ వినాశకరమైన పర్యవసానాలకే దారి తీస్తాయని, అటువంటి వాటిని కఠినంగా ఎదుర్కోవాల్సి వుందని సుప్రీం కోర్టు పదే పదే హెచ్చరిస్తూ వస్తోంది. భద్రత కల్పించడానికి అధికారికంగా నిర్దేశించబడిన వారిపై ఇటువంటి మతోన్మాద ఆలోచనా ధోరణి ప్రభావం చూపుతుందని ఈ సంఘటన స్పష్టంగా రుజువు చేసిందని, ఇది మరింత ఆందోళన కలిగించే అంశమని పొలిట్‌బ్యూరో పేర్కొంది. హిందూత్వ శక్తుల విషపూరితమైన ఎజెండా దేశాన్ని లోతైన అగాధంలోకి నెడుతోందని, ఖండించదగిన ఈ చర్య భారతదేశానికి మేల్కొలుపు వంటిదని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

కులగణనకు బీహార్ హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

పాట్నా: దేశంలో జనాభా లెక్కల్లో కులాల వారీగా కుల గణన చేపట్టాలని దేశ వ్యాప్తంగా పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాల్లో కులగణనను‌కు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగా బీహార్‌లో ఈ ఏడాది జనవరిలో కుల గణన ప్రారంభమైంది. రెండో విడత సందర్భంగా కొందరు కోర్టుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో మంగళవారం పాట్నా హైకోర్టు తీర్పు కీలకంగా మారింది. నితీశ్ సర్కార్‌కు పాట్నా హైకోర్టులో ఊరట లభించింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో కులగణనకు మార్గం సుగమం అయింది. ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన కులగణన సర్వేను సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. బీహార్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను పట్నా హైకోర్టు మంగళవారం కొట్టేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేను తిరిగి ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది. ఈ ఏడాది జనవరిలో బిహార్ ప్రభుత్వం కులగణనను మొదలుపెట్టిన విషయం తెలిసిందే. మొదటి దశ సర్వే జనవరి 7-21 తేదీల మధ్య ముగిసింది. రెండో సర్వే ఏప్రిల్ 15న మొదలై మే15తో ముగియాల్సి ఉండగా.. మే 4న పాట్నా హైకోర్టు సర్వేపై స్టే విధించింది. మంగళవారం కులగణనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె. వినోద్ చంద్రన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపి వాటిని కొట్టేసింది. అయితే, పాట్నా హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేస్తామని పిటిషనర్ల తరపు న్యాయవాది దిను కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ కులాల వారి అభ్యున్నతికి పాటుపడేందుకు వీలుగా వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల గురించి సమాచారం తెలుసుకునేందుకు బిహార్‌లో కులగణన చేపట్టనున్నట్లు గతేడాది సీఎం నితీశ్ కుమార్ ప్రకటించారు. రాష్ట్రంలోని 38 జిల్లాల్లో రెండు దశల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని అప్పట్లో ప్రకటించారు.

ఇంజినీరింగ్ కాలేజీ ఫీజు వివాదం విచారణ నేటికి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజుల అంశంపై హైకోర్టు ఒక ప్రతిపాదన చేసింది. కాలేజీలు, ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం లేదు. దీంతో హైకోర్టు, ఇంజినీరింగ్ ఫీజు రూ.42,500 లుగా ప్రతిపాదించింది. ఇంతకంటే ఎక్కువ ఫీజు ఉన్న కాలేజీలు అదనంగా 10 శాతం వసూలు చేసుకోవచ్చునని చెప్పింది. ఈ ప్రతిపాదనపై కాలేజీ మేనేజ్‌మెంట్స్ తమ వైఖరి చెప్పాలని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఆదేశించారు. విచారణను బుధవారానికి వాయిదా వేశారు. 2020-23 ఏడాదులకు ఇంజినీ రింగ్ కాలేజీల ఫీజులపై కాలేజీ యాజమా న్యాల సంఘం అభ్యంతరం చెబుతూ హైకోర్టును ఆశ్రయించింది.

Canara Bank
A Government of India Undertaking
सिंडिकेट Syndicate
బంజారా హిల్స్-2 బ్రాంచి (డిపి 13006), హైదరాబాద్.
ఫోన్: 040 23351319,
Email id:cb13006@canarabank.com

డిమాండ్ నోటీసు (సెక్షన్-13(2))

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ **నోటీసు.** దిగువ చెప్పిన రుణ సదుపాయాలుకు వారు మా పేరున నిర్వహించిన సంబంధిత పత్రాల ఆదారంగా, ఆస్తులను తాకట్టుపెట్టబడినవి ఇందు దిగువ షెడ్యూలులో ప్రత్యేకంగా వివరించబడినవి. నిర్దేశించిన షరతుల ప్రకారం మీ బకాయిలను చెల్లించుటలో మీరు విఫలంచెందినప్పటి నుండి, బ్యాంకు పూర్తి బకాయిలు చెల్లించుటకు సదరు చట్టం సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ ప్రకటన జారీచేయబడినది.

రుణగ్రహీత/హామీదారు/తాకట్టుదారు:
1) మెసర్స్ సిక్కోలు ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, సి-9, 2వ అంతస్తు, బంజారా గార్డెన్స్ అపార్టుమెంట్స్, రోడ్ నం.12, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500034 (రుణగ్రహీత).
2) చల్లా రమేశ్ తండ్రి నాంచారయ్య చల్లా, 2-127, అమెరికన్ హాస్పిటల్ వెనుక, కొండపల్లి, విటిపిఎస్: కొండపల్లి, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521228. (డైరెక్టర్)-9949259411.
3) ఇంజెటి రూప భర్త సునీల్, గంధం రెసిడెన్సీ భవన్, 3, న్యూ బోయిన్‌పల్లి, హైదరాబాద్, తెలంగాణ-500011. (డైరెక్టర్)-9133877930.
4) రాజేశ్వరి బాతూల్ కంకిపాటి భర్త బాబ్జి, నం.29-140/2/5, ప్లాట్ నం.59 పై, సర్వే నం. 325/1, దినాకర్ నగర్, నేరేడ్‌మెట్, మల్కాజిగిరి సర్కిల్, మల్కాజిగిరి మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500056 (హామీదారు)-7013182438.

బకాయి మొత్తాలు: తేది: 23.06.2023 నాటికి వడ్డీ& దానిపై ఇతర వ్యయాలతో: రూ.1,23,27,214.70పై.లు (రూపాయలు ఒక కోటి ఇరువై మూడు లక్షల ఇరువై ఏడు వేల రెండు వందల పద్నాలుగు మరియు డెబ్బై పైసలు మాత్రమే), ఎన్‌పిఎ తేది: 29.07.2023, లోన్ ఖాతా నం.లు: 125002299095(ఎస్ఒడి).

(సెక్యూరిటీ అసెట్స్ వివరాలు: చరాస్తులు 1. స్టాక్& బుక్ డెట్స్ యొక్క హైపోతికేషన్ (టైటిల్ హోల్డర్ పేరు: మెసర్స్ సిక్కోలు ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్)
స్థిరాస్తులు: శ్రీమతి బికె రాజేశ్వరి ఎవరైతే అత్తవిన డైరెక్టర్ శ్రీమతి ఇంజెటి రూపా పేరున ఆస్తి ఉన్న, రంగారెడ్డి మరియు జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో నేరేడ్‌మెట్, దినకర్ నగ్రా వద్దగల 960చ.అ.ల ఆర్‌సిసి ప్లింత్ ఏరియాతో సర్వే నం.325/1, విస్తీర్ణం 276.0చ.గ.లు లేదా 230.73చ.మీ.లు గల ప్లాట్ నం.59 పై నివాసిత ఇంటి నం.29-1407/2/5 యొక్క దిగువ పేర్కొన్న వివరాల ఆర్ఇఎంతో తాకట్టుపెట్టబడిన ఆస్తి. సరిహద్దులు: ఉత్తరం: పొరుగువారు-39 చ.ల్యాండ్, దక్షిణం: రోడ్డు, పడమర: ఇంటి నం.28-143/58, తూర్పు: ఇంటి నం.28-143/60 (టైటిల్ హోల్డర్ పేరు: శ్రీమతి బికె రాజేశ్వరి)

ఒకవేల మీరు, పై పేర్కొనబడిన వ్యక్తులు షార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద ఈ నోటీసులోని నియమాల క్రింద పై చూపిన మొత్తాలను తదుపరి వడ్డీ& ఇన్సిడెంటల్ వ్యయాలతో మీచే పై పేర్కొన్న బకాయి మొత్తాలను ఖర్చులను ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించుటలో విఫలం చెందినచో, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింది బ్యాంకు అన్ని లేదా ఏవేని హక్కులను వినియోగిస్తుంది. తదుపరి మీరు మా ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, ఏదేని విధానంలో షెడ్యూలులో పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్ దేనితోనైనా లావాదేవీలు జరుపుట నుండి మీరు నిషేదించబడినారు. సదరు చట్టం మరియు/లేదా ఏవేని ఇతర చట్టం ప్రాతిపదికన మాకు అందుబాటులోగల ఏవేని ఇతర అదికారాలతో పక్షపాతంలేకుండా ఈ ప్రకటనను జారీచేస్తున్నాము. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, షార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై మీరు దృష్టి పెట్టవలసిందిగా కోరబడుచున్నది. డిమాండ్ నోటీసును బ్రాంచి రికార్డులో అందుబాటులోగల మీ గతంలో తెలిసిన చిరునామాకు అక్నాలెడ్జిమెంట్ డ్యూ గల రిజిస్టర్డు పోస్టు ద్వారా మీకు కూడా పంపబడినది.

తేది: 31.07.2023, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ADITYA BIRLA CAPITAL
PROTECTING INVESTING FINANCING ADVISING
ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం:- ఇండియన్ రేయాన్ కాంపౌండ్, వెరవల్, గుజరాత్-362266
శాఖ చిరునామా:- "ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, కానూరు బాపయ్య కన్‌స్ట్రక్షన్స్ అండ్ లీసింగ్ బిల్డింగ్ (కెబిసిఎల్), డో.నం.40-1-52సి, ఆచార్య రంగా నగర్, కెఎఫ్‌సి ప్రక్కన, ఎమ్‌జి రోడ్డు, బెంజి సర్కిల్ వద్ద, విజయవాడ-520010"

సర్ఫేసీ యాక్ట్ 2002 యొక్క యు/ఎస్ 13(2) డిమాండ్ నోటీసు

మీరు క్రింద పేర్కొన్న రుణగ్రహీత షెడ్యూల్ పేర్కొన్న ఆస్తిని తనఖా పెట్టడం ద్వారా రుణం పొందారు ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎబిహెచ్ఎఫ్ఎల్) నుండి వారు పొందిన క్రెడిట్ సదుపాయాన్ని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయినందున దిగువ పేర్కొన్న విధంగా రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వబడింది. మరియు వారి ఖాతాలను ఆర్‌బిఐ కంపెనీ పుస్తకాలలో మార్గదర్శకాల ప్రకారం 14.07.2023న నాన్-పర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడింది. ఆ తర్వాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం (SARFAESI యాక్ట్)లోని సెక్షన్ 13(2) క్రింద ఎబిహెచ్ఎఫ్ఎల్ డిమాండ్ నోటీసును జారీ చేసింది. ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చివరిగా తెలిసిన చిరునామాకు తద్వారా పైన పేర్కొన్న మొత్తం మరియు యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చు, ఛార్జీలు మొదలైన వాటిపై కాంట్రాక్టు రేటుతో మరింత వడ్డీతో పాటు మొత్తం బకాయిని తిరిగి చెల్లించమని వారిని కోరడమైనదని డిమాండ్ నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, (SARFAESI యాక్ట్) లోని రూల్ 3(1) ప్రకారం డిమాండ్ నోటీసు ప్రచురణ ద్వారా కూడా అందించబడుతోంది.

లోను ఖాతా నం., రుణగ్రహీత/సహ రుణగ్రహీత మరియు హామీదారులు పేరు మరియు చిరునామా	అమలు చేయబడిన సెక్యూరిటీ వివరాలు	డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం
లోన్ ఎకౌంట్ నం.: ABFLVJWLAP0000067408 (వాణిజ్య ఆస్తిపై రుణం) ABFLVJWLAP0000103103 (గ్యారెంటీడ్ ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ రుణ సౌకర్యం) 1. శ్రీ. చింతక్రింది రమేష్, డో.నం.8-242, భారగవపేట, చర్చ్ వద్ద, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503. ఇక్కడ కూడా : నం.8-638/ఎ, తెనాలి రోడ్డు, మిద్దె సెంటర్, మంగళగిరి-522503...(రుణగ్రహీత) 2. శ్రీమతి. చింతక్రింది శ్రీదేవి, డో.నం.8-242, భారగవపేట, చర్చ్ వద్ద, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503. ఇక్కడ కూడా : నం.8-638/ఎ, తెనాలి రోడ్డు, మిద్దె సెంటర్, మంగళగిరి-522503.. (సహ రుణగ్రహీత) 3. విజయదుర్గా పెయింట్స్, నం.8-638/ఎ, తెనాలి రోడ్డు, మిద్దె సెంటర్, మంగళగిరి-522503...(సహ రుణగ్రహీత)	గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్, మంగళగిరి మున్సిపల్ ఏరాయి వద్ద ఉన్న మూల్యాంకనం నం.1023015774, రెవెన్యూ వార్డు నం.8, డో.నం.8-638/ఎ లో ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ బేరింగ్ రెసిడెన్షియల్ సైట్ విస్తీర్ణం 105 చ.గ.లు. లేదా 87.79 చ.మీ.లు. తో కలిసి ఆర్‌సిసి రూఫ్డ్ గ్రౌండ్ మరియు 1వ అంతస్తు రెసిడెన్షియల్ భవనం అందులో అన్నీ సౌకర్య హక్కులతో హద్దులు : తూర్పు: చింతక్రింది శ్రీదేవి మరియు కూరపాటి రామారావుకు చెందిన ఉమ్మడి ఆస్తి, దక్షిణం: కూరపాటి రాజారావు కు చెందిన ఇల్లు, పడమర: మహమ్మద్ దాలి సాహెబ్ మరియు ఇతరులకు చెందిన ఇల్లు, ఉత్తరం: మున్సిపల్ బజార్.	July 21, 2023	రూ. 1,51,94,934.54/- (ఒక కోటి యాభై ఒక లక్షల తొంభై నాలుగు వేల తొమ్మిది వందల ముప్పై నాలుగు రూపాయల యాభై నాలుగు పైసలు మాత్రమే) 19.07.2023 వరకు బాకీ ఉన్న ప్రిన్సిపల్, బకాయిలు (పెరిగిన ఛార్జీలతో సహా) మరియు వడ్డీ.

వడ్డీ మరియు ఖర్చు, ఛార్జీలు, ఖర్చులతో పాటు సదరు మొత్తాన్ని ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోపు ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్‌కి చెల్లించవలసిందిగా ఇక్కడ పేర్కొన్న రుణగ్రహీతలు మరియు హామీదారులు మరియు తనఖాదారులను మేము ఇందు మూలంగా పిలుస్తున్నాము. విఫలమైనయెడల రుణగ్రహీతలు, తనఖాదారులు మరియు హామీదారుల యొక్క సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనం చేసుకోవడంతో సహా అన్ని లేదా ఏదైనా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సెక్యూర్డ్ అసెట్స్‌కు వ్యతిరేకంగా ఈ చట్టం యొక్క నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకునే స్వేచ్ఛ ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్‌కు ఉంటుంది. 1) లీజు ద్వారా బదిలీ చేసే హక్కులు, సురక్షిత ఆస్తులను విడుదల చేయడం కోసం అమ్మకం కేటాయింపుతో సహా రుణగ్రహీతలు/హామీదారుల సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనం చేసుకునే అధికారం 2) లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ చేసే హక్కులతో సహా సురక్షిత ఆస్తుల నిర్వహణను స్వాధీనం చేసుకోవడం మరియు సురక్షిత ఆస్తులను గ్రహించడం మరియు ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా సురక్షిత ఆస్తులకు సంబంధించిన ఏదైనా బదిలీ చేయడం ద్వారా బదిలీ చేయబడిన సురక్షిత ఆస్తులకు సంబంధించిన అన్ని హక్కులు మరియు సంబంధితంగా ఉంటాయి. ఇది మీ ద్వారా బదిలీ చేయబడింది. పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(13) నిబంధనల ప్రకారం, ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా పైన పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌లను అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (మీ వ్యాపారం యొక్క సాధారణ కోర్సులో కాకుండా) బదిలీ చేయకుండా నిషేధించబడ్డారు. పైన సూచించిన విధంగా ఏవైనా సెక్యూర్డ్ అసెట్స్ మరియు ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క ముందస్తు అనుమతి లేకుండా ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్‌కు హైపోథికేటెడ్/తాకట్టు పెట్టబడింది.

ప్రదేశం: గుంటూరు
తేది: 02.08.2023
సం/- అధీకృత అధికారి
ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్

మిడత సాయం

ఒక అడవిలో కుందేలు, జింక, దుప్పి మూడింటికి బాగా స్నేహం కుదిరింది. ఒక రోజు అడవిలో కూరగాయల సంత జరుగుతోందని తెలియడంతో మూడూ సంతకు బయలుదేరాయి. అటుగా వెళుతున్న నక్కకి ఇవి కనిపిస్తాయి. దీంతో ఎప్పటి నుండో వాటి మాంసం తినాలనే కోరికను తీర్చుకోవాలనుకుని ఓ పథకం వేసింది. వాటితో మంచిగా మాటలు కలిపి, తన ఇంటికి తీసుకు వెళ్ళాలనుకుంది. అనుకున్న వెంటనే వాటితో, 'ఏమిటో విశేషం! ముగ్గురూ కలిసి ఎక్కడికో బయలు దేరినట్టున్నారు' అంటూ మాటలు కలిపింది. నక్కను చూడగానే అవి చాలా భయపడ్డాయి. అది గమనించిన నక్క, 'అరే మీరు భయపడాల్సిన పని లేదు. ఇప్పుడు నేను మాంసాహారిని కాను. మీలాగే శాకాహారిని. మా అమ్మ ఓ ఏడాది పాటు మాంసం ముట్టకూడదని వ్రతం చేస్తోంది. ఇపుడు నేను కూడా మీ మిత్రుడినే' అని నమ్మ పలికింది. నక్క మాటలను నమ్మిన జంతువులు దాన్ని తమతో బయల్దేరనిస్తాయి. దారిలో ఓ చోట, నక్క తన పథకాన్ని అమలుచేసింది.

'మిత్రులారా, ఇక్కడికి దగ్గర్లోనే మా ఇల్లు ఉంది. ఇప్పటికే చాలా దూరం నడిచి వచ్చాం. కాసేపు మా ఇంటి దగ్గర సేదదీరి ఆ తరువాత బయల్దేరదాం' అని చెప్పింది. ఆ మాటలు నమ్మిన జంతువులన్నీ నక్క ఇంటికి బయల్దేరాయి. ఇదంతా గమనిస్తూ వస్తున్న ఓ మిడత, నక్క ఏదో జిత్తుల మారి పన్నాగం పన్నిందని వాటిని అనుసరించింది. నక్క ఇంటి అటకపై వాలి చూడసాగింది. అదను కోసం చూస్తున్న నక్క ఇంట్లోకి వచ్చిన మూడు జంతువులతో 'తలుపు వేసి వస్తాను. మిత్రులారా! అంది. నక్క నుండి ఏదో ప్రమాదం వాటిల్లుతోందని గ్రహించిన మిడత వెంటనే కుందేలు, జింక, దుప్పి చెవిలో తప్పించుకునే ఉపాయం చెప్పింది. ఉపాయం ప్రకారం జింక, దుప్పి కింద పడి గిల గిల కొట్టుకోవడం మొదలు పెట్టాయి. వెంటనే కుందేలు 'అయ్యయ్యో! నక్క మిత్రమా వాటి రెండింటికి మూర్ఛ వ్యాధి ఉంది. నువ్వు తొందరగా రెండు ఇనుప చువ్వలు తెచ్చి వాటి చేతిలో పెడితే కాని అవి బతకవు' అని కంగారుగా అంది. ఏం జరుగుతుందో అర్థం గాని నక్కకు మూర్ఛ వ్యాధితో చనిపోయిన వీటిని తింటే తనకూ ఆ వ్యాధి వస్తుందని భయపడి కుందేలు చెప్పినట్టు చేస్తుంది. ఇనుప చువ్వలు తెచ్చి జింక, దుప్పి చేతిలో పెట్టగానే అవి గబుక్కున లేచి ఆ చువ్వలతో నక్క తల పై బాదాయి. ఆ దెబ్బతో నక్క కిందపడిపోయింది. ఆ మూడు జంతువులు బయటకొచ్చి ఆ జిత్తులమారి నక్క నుండి కాపాడిన మిడతకు కృతజ్ఞతలు తెలియచేశాయి.

- కయ్యూరు బాల సుబ్రమణ్యం,
94417 91239

నేను గీసిన బొమ్మ



లియాఖత్ అలీ ఖాన్,
9వ తరగతి,
భాష్యం స్కూలు,
గుంటూరు.

తేడాలు కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

'పిల్లలకు చదువు విలువ తెలియాలి.. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. ఆ దిశగా పిల్లలను ఎలా దారి మళ్లించాలి..' అని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల గురించి ఆందోళన చెందుతారు. అయితే మీ పిల్లలకు ఓ కథ చెప్పండి.. కష్టాలు, కన్నీళ్లు నిండిన ఆ కథ ఓ వాస్తవ గాథ.. ఇల్లిల్లూ తిరిగి భిక్షాటన చేసిన ఓ అబ్బాయి.. కట్టెలు కొట్టి, శవాలకు గోతులు తీసిన ఓ యువకుడు.. పుస్తకాలు కొనుక్కునేందుకు పశువుల పేడ ఎత్తిన వైనం చెప్పండి. నిత్యం అవమానాలు, అవహేళనల మధ్య చదువనే ఊతం పట్టుకుని పోలీసు శాఖలో ఉన్నతాధికారిగా ఎదిగిన ఆయన, ప్రస్తుతం అనంతపురం ఎఆర్ విభాగంలో ఎఎస్‌పిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎ. హనుమంతులు. ఆయన స్ఫూర్తిగాథ ఎందరికో ఆదర్శం. సామాజిక మాధ్యమంలో ఇప్పుడు బాగా వైరల్ అవుతున్న ఆయన జీవిత విశేషాలు తన మాటల్లో తెలుసుకుందాం..

అవమానాలను దాటి .. అధికారిగా మారి ...

'మేం సంచార తెగకు చెందిన వాళ్లం. మా తాత, ముత్తాతలు ఊళ్లు తిరుగుతూ ఊరి చివర ఓ గుడారం వేసుకుని కొన్ని రోజులు అక్కడే మకాం ఉండేవారు. ఊళ్లో ఉండే బయట(పశువుల కొట్టంలో పని, శ్మశానంలో గోతులు తీయడం, పొలంలో ఇతర పనులు) పనులన్నీ చేసేవారు. అలా మా తాత చిత్తూరు జిల్లా కలికిరి మండలం తెల్లగుట్టపల్లి గ్రామంలో ఉంటుండగా అక్కడే చనిపోయాడు. దాంతో ఆ గ్రామమే మా స్వగ్రామం అయ్యింది' అంటూ ఎక్కడా ఇసుమంత గర్వం లేకుండా ఓ సాధారణ వ్యక్తిలా తన పుట్టుక, తన వారి మూలాల గురించి చెబుతున్నారు హనుమంతులు.

అమ్మతో పాటు భిక్షాటన చేశాను..

సంచార తెగ వారు కావడం వల్ల గ్రామంలో పనులు ఉన్నప్పుడు చేసుకోవడం, పనులు లేనప్పుడు ఇల్లిళ్లూ తిరిగి భిక్షాటన చేసుకోవడం ఆ కుటుంబాల ఆనవాయితీ. అలా నలుగురు బిడ్డలను పెంచడానికి హనుమంతులు అమ్మానాన్న ఎన్నో కష్టాలు పడ్డారు. 'అమ్మతో పాటు నేను కూడా భిక్షాటన చేశాను. అప్పుడు నా వయసు 4 ఏళ్లు. నాకు ఆరో ఏడు వచ్చేసరికి అమ్మానాన్న, 'పిల్లలను చదివిస్తే బాగుండు.. మన తలరాతలు మారాలంటే ఎలాగైనా వారిని చదివించాల'ని మాట్లాడుకోవడం విన్నాను. ఆ వయసులో ఆ మాటల లోతు నాకు అర్థం కాకపోయినా.. అమ్మానాన్న సంతోషంగా ఉండాలంటే ఎలాగైనా చదువుకోవాలి అని బలంగా నాటుకుపోయింది.

నా పక్కన కూర్చొనేవారు కాదు..

ఒక రోజు స్కూల్లో చేర్పించేటందుకు అమ్మ నన్ను బడికి తీసుకెళ్లింది. నా చిరిగిన బట్టలు, చింపిరి జుట్టు చూసి అన్నం అడుక్కోవడానికి వచ్చామని భావించి గెంటేయబోయారు. అయితే అన్నం కోసం కాదు.. చదువు కోసం వచ్చానని తెలిసి లోపలికి రమ్మన్నారు. కానీ వారి ఇళ్లకు వెళ్లి అడుక్కోవడం చూసిన తోటి పిల్లలు చాలా రోజులు నన్ను వారి పక్కన కూర్చోనివ్వలేదు. నాతో మాట్లాడలేదు. అలా స్కూల్లో చేరిన కొత్తల్లో ఎన్నో అవమానాలు పడ్డా.. అయినా చదువుకోవడం ఆపలేదు' అంటూ తన తొలి బడి సంగతులు, ఎదుర్కొన్న వివక్ష గురించి ఆయన చెబుతూ 'ఈ రోజుల్లో పిల్లలకు తల్లిదండ్రులు అన్నీ సమకూరుస్తున్నారు. అడిగిందల్లా ఇస్తున్నారు. అయినా పిల్లలు చదువు విలువ తెలుసుకోవడం లేదు' అని ఒకింత విచారం వ్యక్తం చేశారు.

దాహం వేసి నీళ్లడిగితే.. చిప్ప వెతికింది..

హనుమంతులు చదువుకుంటూనే సెలవురోజుల్లో గ్రామంలో బయట పనులకు వెళ్లేవారు. రోజుకు రూ.1, రూ.2 కూలీకి చేసిన రోజులు కూడా ఉన్నాయి. 'ఒకసారి ఓ ఇంట్లో పనికి వెళ్లాను. బాగా దాహం వేసింది. ఆ ఇంటి యజమానిని కాసిన్ని నీళ్ల ఇవ్వమని అడిగాను. అప్పుడు ఆమె నాకు నీళ్లివ్వకుండా చాలాసేపు ఏదో వెతుకుతూ కనిపించింది. 'ఏంటమ్మా వెతుకుతున్నారు' అని అడిగాను. 'మంచినీళ్లు అడిగావు కదరా.. చిప్ప కోసం వెతుకుతున్నాను. అదేమో కనిపించడం లేదు' అంటూ విసుగ్గా మాట్లాడింది. మా కోసం ప్రత్యేకంగా గ్లాసు, బిందె పెట్టుకునే ఆ రోజుల్లో తన ఇంటి బిందెలో నుండి నీళ్లు పోయడానికి ఆమె సంకోచిస్తే దోసిళ్లల్లో పోయమని చెప్పి దాహం తీర్చుకున్నాను. అప్పుడు నేను ఇంటర్ చదువుతున్నాను. ఇటువంటి అవమానాలు నాకు ఎన్నో ఎదురయ్యాయి' అని ఆనాటి సమాజాన్ని ఆయన మన కళ్లముందుంచారు.

విజయనగరంలో ఎన్నో మధురానుభూతులు

1991లో ఆర్ఎస్ఐ విభాగంలో పోలీసుశాఖలో ఉద్యోగం వచ్చిన హనుమంతులు ఆనాటి నుండి ఇప్పటి వరకు తన గతం తాలూకు జ్ఞాపకాలను మరవలేదు. అందుకే ఆర్ఐ, డిఎస్‌పి, ఎఎస్‌పిగా విధులు నిర్వర్తిస్తూనే సమాజానికి తన వంతుగా ఏదైనా సాయం చేయాలని తపించేవారు. సామాజిక సేవలో భాగమయ్యేవారు. యోగాపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తూ పలు కార్యక్రమాల్లో పాల్గొనేవారు. '2016లో విజయనగరంలో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు ఓ స్కూల్లో యోగాపై అవగాహనా క్లాసు నిర్వహించాను. ఆ స్కూల్లో డ్రాపౌట్లు ఎక్కువగా ఉన్నారని ఏదైనా స్ఫూర్తివంత మాటలు చెప్పమని స్కూలు యాజమాన్యం నన్ను అడిగింది. ఏవో మాటలు చెప్పే బదులు.. నా గురించి చెబితే సరిపోతుంది కదా అని భావించాను. నా గురించి చెప్పడం అప్పటినుండే మొదలుపెట్టాను. అయితే ఎక్కడా ప్రచారం చేయవద్దని మీడియా వారిని, స్కూలు యాజమాన్యాన్ని కోరేవాడిని. పదేళ్ల క్రితం మొదటిసారి నా జీవితాన్ని ఆ స్కూలు పిల్లలతో చెబితే.. ఆ తరువాత ఎన్నో స్కూళ్ల ప్రత్యేకంగా నన్ను వారి కార్యక్రమాలకు ప్రత్యేక అతిథిగా పిలిచేవారు. పిల్లలతో నా గురించి చెప్పమనేవారు. మొదటిసారి చెప్పినప్పుడు ఆ స్కూల్లో 200 మంది విద్యార్థులు తిరిగి స్కూలుకు వచ్చారని తెలిసి, ఆ జిల్లాలో ఉన్న మిగిలిన స్కూళ్లన్నింటికీ నన్ను పిలిచేవారు' అంటూ పదేళ్ల క్రితం తన అనుభవాన్ని చెప్పిన హనుమంతులను పోలీసు శాఖలోనే కాదు, విద్యావ్యవస్థలోనూ ప్రత్యేకంగా గౌరవిస్తారు. సాధారణంగా పోలీసులకు, టీచర్లకు మధ్య స్నేహసంబంధాలు ఉండడం చాలా అరుదు. కానీ హనుమంతులకు, టీచర్లకు మధ్య ఓ విశేష బంధం ముడిపడి ఉంది.

ప్రత్యేక అనుమతితో టీచర్లు వచ్చారు

'విజయనగరం నుండి అనంతపురం బదిలీ అవుతున్నప్పుడు ఇచ్చిన వీడ్కోలు సభలో పోలీసులతో పాటు వందలమంది ఉపాధ్యాయులు కూడా ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ సభకు వస్తామని వారంతా అభ్యర్థించారు. సాధారణంగా బయటివారికి అలా అనుమతులు ఇవ్వరు. కానీ ఆ రోజు అందరినీ ఆహ్వానించారు. ఇది నా జీవితంలో మరిచిపోలేని అనుభవం' అంటూ విజయనగరం స్మృతులను ఆయన గుర్తుచేసుకున్నారు.

అందరినీ ఎదగనివ్వాలి

'మనం ఎదుగుతూ సమాజాన్ని కూడా ఎదగనివ్వాలన్న' అంబేద్కర్ సూక్తిని నేను పాటిస్తాను. నేను పడ్డ కష్టాలు, కన్నీళ్లు నా పిల్లలకు చెప్పి, మీ చదువు కోసం సాయం చేస్తాను. మీ భవితకు ఉపయోగపడే చదువు చదువుకోండి. అయితే ఉన్నత విద్యావంతులైన తరువాత సమాజానికి మీ వంతుగా ఏదైనా చేయండి.. అదే మీ నుండి నేను కోరుకునేది అని ఎప్పుడూ చెబుతుంటాను. నా పిల్లలు ఆ బాటలోనే నడుస్తారని గట్టి నమ్మకం ఉంది' అంటూ తన నలుగురు బిడ్డల గురించి చెబుతున్నప్పుడు ఆయన మాటల్లో ఆనందం కనబడుతోంది.

జీవితంలో ఎదురైన ప్రతి కష్టాన్ని దాటుకుంటూ, గొప్ప వ్యక్తిత్వంతో నడుస్తూ.. స్ఫూర్తివంత జీవితాన్ని గడుపుతున్న హనుమంతులు ఇంకా ఇలా అంటున్నారు.. 'నా జీవితం గురించి ఇప్పుడు ప్రతి ఒక్కరూ తెలుసుకుంటున్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు చూపిస్తున్నారు. పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల్లో నా వీడియోలు ప్రదర్శిస్తున్నారు. విదేశాల్లో కూడా నా జీవితపాఠాలపై ఆసక్తి కనబరుస్తున్నారని తెలిసింది. నా జీవితకథ ద్వారా పిల్లల్లో మార్పు వస్తుందని తల్లిదండ్రులు భావించడం నాకు చాలా ఆనందంగా ఉంది. పిల్లలకు చదువు విలువ తెలియాలి. ఉన్నత విద్యావంతులుగా ఎదగాలి. అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. సమాజ అభివృద్ధే దేశ ప్రగతి..

– జ్యోతిర్మయి

శాంతించిన 'గోదావరి'

- సాధారణ స్థితికి ప్రవాహం
- కాటన్ బ్యారేజీ వద్ద 10.9, భద్రాచలం వద్ద 29.10 అడుగుల నీటిమట్టం
- పలుచోట్ల ధ్వంసమైన రోడ్లు
- రహదారులపై పేరుకుపోయిన ఒండ్రు

ప్రజాశక్తి- యంత్రాంగం

వారం రోజులుగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి శాంతించింది. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం సాధారణ స్థాయికి చేరుకుంది. దీంతో, గోదావరి తీరప్రాంత వాసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, వరద ఉధృతికి పలు రోడ్లు ధ్వంసమయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 11.70 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో, ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. అనంతరం వరద క్రమంగా తగ్గుతూ సాయంత్రానికి 10.90 అడుగులకు చేరుకుంది. కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి 8,64,489 క్యూసెక్కులు, డెల్టా కాలువలకు 11,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలం వద్ద కూడా వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. అక్కడ నీటిమట్టం 29.10 అడుగులకు తగ్గింది. గోదావరి వరద వల్ల కోనసీమ జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 36 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వరద ప్రవాహం తగ్గడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాజ్‌వేలు నీటి నుంచి బయటపడడంతో పి.గన్నవరంలో కనకాయిలంక కాజ్‌వే, అయినవిల్లిలో అయినవిల్లిలంక కాజ్‌వేలపై రాకపోకలు సాగాయి.

పోలవరం కాఫర్ డ్యాం బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల కుక్కునూరు–దాచారం మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వేపై వరద ఏ మాత్రం తగ్గకపోవడంతో 14 గిరిజన గ్రామాలకు గత 17 రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. వరద ముంపు నుండి బయటపడిన రహదారులపై అడుగు మందం ఒండ్రు పేరుకుపోవడంతో వాహనాలు తిరగలేని పరిస్థితి ఉంది. వరద ఉధృతికి వేలేరు–బూర్గంపాడు ప్రధాన రహదారి ధ్వంసం అవడంతో బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పోలవరం వద్ద కూడా గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. ఈ ప్రాజెక్టు నుండి 9,29,921 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఇఇ పి.వెంకటరమణ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 32.320 మీటర్లు, దిగువన 24.000 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాం వద్ద 33.070 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాం వద్ద 23.500 మీటర్లు, పోలవరం వద్ద 22.577 మీటర్ల నీటిమట్టం నమోదైంది. పోలవరం ప్రాజెక్టుకు వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట, యలమంచిలి మండలాల్లోని లంక గ్రామాలు ముంపు నుంచి తేరుకుంటున్నాయి. లంక గ్రామాలకు గోదావరిపై పడవల రాకపోకలను ఇంకా అధికారులు పునరుద్ధరించలేదు. ఆచంట మండలంలోని లంక గ్రామాల్లో సుమారు నాలుగు వేల ఎకరాల్లో అరటి, కొబ్బరి, బొప్పాయి, మునగ, తమలపాకు, బెండ, బీరతోపాటు పలు రకాల ఆకుకూరల పంటలు నీట మునిగాయి. ఎకరానికి రూ.లక్ష నుంచి సుమారు రూ.2 లక్షల వరకు పెట్టుబడులు పెట్టామని, పంటంతా వరద పాలైందని లబోదిబోమంటున్నారు.

తేరుకున్నంటున్న ముంపు మండలాలు

పది రోజులుగా పొంగి ప్రవహించిన గోదావరి, శబరి నదులు శాంతించాయి. దీంతో, అల్లూరి జిల్లాలోని ముంపు మండలాలైన విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాకలు తేరుకున్నాయి. సోమవారం రాత్రికి పూర్తిగా వరద తొలగిపోవడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. చింతూరు మండలం కల్లేరు, చట్టి, కొమ్మూరు, ముకునూరు, ఎజి.కోడేరు, చింతూరు గ్రామాల్లోనూ, విఆర్.పురం మండలం వడ్డుగూడెం, వడ్డుగూడెం కాలనీ తదితర ప్రాంతాల్లోనూ, కూనవరం మండలంలో పలు గ్రామాల్లోనూ పారిశుధ్య పనులు ప్రారంభమయ్యాయి. అధికారుల ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో బ్లీచింగ్ చల్లారు. చింతూరు నుంచి విఆర్.పురం వెళ్లే రహదారిపై పేరుకుపోయిన బురదను తొలగించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సబ్ కలెక్టర్ బన్సల్, చింతూరు ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే సహాయక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

కదం తొక్కిన ఇషాన్, గిల్

- హార్దిక్ కెప్టెన్సీ ఇన్నింగ్స్
- భారత్ 351/5
- రోహిత్, కోహ్లికి విశ్రాంతి

టరోబా: నిర్ణయాత్మక మూడో వన్డేలోనూ టీమిండియా బ్యాటర్స్ కదం తొక్కారు. తొలుత యువ క్రికెటర్లు ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్ సెంచరీ భాగస్వామ్యానికి తోడు చివర్లో హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో బ్యాట్ ఝుళిపించాడు. దీంతో టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 351పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. బ్రియాన్ లారా స్టేడియంలో మంగళవారం జరిగిన మూడో, చివరి వన్డేలో ఇషాన్ కిషన్–శుభ్‌మన్ గిల్ తొలి వికెట్‌కు 143పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇషాన్ కిషన్ కేవలం 43బంతుల్లో 5ఫోర్లు, 2సిక్సర్ల సాయంతో 77పరుగులు చేయగా.. శుభ్‌మన్ గిల్(85; 92బంతుల్లో 11ఫోర్లు) అర్ధసెంచరీ కొట్టారు. ఈ క్రమంలో ఇషాన్ వరుసగా మూడు వన్డేల్లో అర్ధసెంచరీలు కొట్టిన బ్యాటర్ల సరసన నిలిచి రికార్డు నెలకొల్పాడు. ఆ తర్వాత వికెట్ కీపర్ సంజు శాంసన్(51; 41బంతుల్లో 2ఫోర్లు, 4సిక్సర్లు) ధనా ధన్ తోడైంది. చివర్లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా(70నాటౌట్; 52బంతుల్లో 4ఫోర్లు, 5 సిక్సర్లు) స్ఫూర్తి దాయక ఇన్నింగ్స్ ఆడాడు. సూర్యకుమార్ యాదవ్(35; 2ఫోర్లు, 2 సిక్సర్లు) కూడా ఫర్వాలేదనిపించాడు. దీంతో భారత్ విండీస్ గడ్డపై తొలిసారి భారీస్కోర్ చేసింది. వెస్టిండీస్ బౌలర్లు షెఫర్డ్‌కు రెండు, జోసెఫ్, మోటీ, కరియన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

రుతురాజ్, ఉనాద్కత్‌కు చోటు

టీమిండియా మేనేజ్‌మెంట్ రెండు మార్పులు చేసింది. రెండో వన్డేలో ఆడిన అక్షర్ పటేల్, ఉమ్రాన్ మాలిక్‌లను బెంచ్‌కు పరిమితం చేసి రుతురాజ్ గైక్వాడ్, జయదేవ్ ఉనాద్కట్‌లకు చోటు కల్పించింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా మాట్లాడుతూ.. డిసైడర్ మ్యాచ్‌లో సత్తా చాటేందుకు కుర్రాళ్లంతా ఉత్సాహంగా ఉన్నారని, పిచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందని అన్నాడు. ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని తప్పక ఉంచుతామని తెలిపాడు. వన్డే ప్రపంచకప్ నేపథ్యంలో ప్రయోగాలకు ఈ సిరీస్ ఉపయోగపడనుందని, ఈ క్రమంలో కోహ్లి, రోహిత్‌లకు రెస్ట్ ఇచ్చి మరీ బెంచ్ బలాన్ని పరీక్షిస్తోందన్నాడు. మూడు వన్డేల సిరీస్‌లో ఇరు జట్లు చెరొక మ్యాచ్ గెలవడంతో ఈ మ్యాచ్ డిసైడర్‌గా మారింది. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన వెస్టిండీస్ ఫీల్డింగ్ ఎంచుకుంది. పిచ్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉందనే ఈ నిర్ణయం తీసుకున్నానని వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ తెలిపాడు. ఎలాంటి మార్పులు లేకుండా విన్నింగ్ కాంబినేషన్‌ను కొనసాగిస్తున్నామని, ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే నిలకడగా రాణించడం ముఖ్యమని తెలిపాడు.

రికార్డుపుటల్లో ఇషాన్..

మూడు వన్డేల సిరీస్‌లో వరుసగా మూడు అర్ధసెంచరీలు కొట్టి ఆటగాళ్ల జాబితాలో భారత వికెట్ కీపర్, ఓపెనర్ ఇషాన్ కిషన్ చేరాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో వన్డేలోనూ అర్ధసెంచరీ బాదిన ఇషాన్.. తొలి వన్డేలో 52, రెండో వన్డేలో 55పరుగులతో సత్తా చాటాడు ఈ క్రమంలో మూడో వన్డేలోనూ అర్ధసెంచరీ పూర్తి చేసుకొని ఈ రికార్డును సాధించిన ఆటగాళ్ల జాబితాలో చేరాడు. మొత్తమ్మీద 64బంతులు ఎదుర్కొన్న ఇషాన్ 8ఫోర్లు, 3సిక్సర్ల సాయంతో 77 పరుగులు చేసి కరియా బౌలింగ్‌లో షాయ్ హోప్‌కు క్యాచ్ ఇచ్చి పెవీలియన్‌కు చేరాడు.

వరుసగా మూడు వన్డేల్లో అర్ధసెంచరీలు కొట్టిన భారత బ్యాటర్లు..

1. కృష్ణమాచారి శ్రీకాంత్ : శ్రీలంకపై(1982)
2. దిలీప్ వెంగ్‌సర్కార్ : శ్రీలంకపై(1985)
3. మహ్మద్ అజహరుద్దీన్ : శ్రీలంకపై(1993)
4. ఎంఎస్ ధోనీ : ఆస్ట్రేలియాపై(2019)
5. శ్రేయస్ అయ్యర్ : న్యూజిలాండ్‌పై(2020)
6. ఇషాన్ కిషన్ : వెస్టిండీస్‌పై(2023)

హథీరాంజీ మఠం మహంత్ పై చర్యలు

దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి హథీరాంజీ మఠానికి గతంలో మహంతుగాఉన్న అర్జున్‌దాస్ అనే వ్యక్తి పలు అక్రమాలకు పాల్పడినట్లు త్రిసభ్య కమిటీ ఆధారాలతో ధృవీకరించిన నేపథ్యంలో చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ధార్మిక పరిషత్తు నిర్ణయించినట్లు దేవాదాయశాఖ మంత్రి కొట్టు స త్యనారాయణ పేర్కొన్నారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ధార్మిక పరిషత్తు ద్వారా హథీరాంజీ మఠం మహంత్‌గా ఉన్న అర్జున్‌దాస్‌ను సస్పెండ్ చేసి ఆయన స్థానంలో తగిన వ్యక్తిని ఇప్పటికే నియమించినట్లు తెలిపారు. ఈనెల 6నుంచి సనాతన హిందూ ధర్మం ప్రాముఖ్యతను నేటి తరానికి తెలియజేయాలనే లక్ష్యంతో నెలరోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని అన్నవరం నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. స్థానిక కళాకారులను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యులను చేసి వారికి పారితోషకాలు కూడా అందజేస్తానన్నారు. శ్రీవాణి ట్రస్టు నిధులతో 1917 దేవాలయాల నిర్మాణాలను త్వరలో పూర్తి చేస్తామని మంత్రి కొట్టుసత్యనారాయణ తెలిపారు.

'సమగ్ర శిక్ష పార్ట్ టైమ్ ఉద్యోగులకు రిటైర్‌మెంటు లబ్ధి చేకూర్చాలి'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమగ్ర శిక్ష పార్ట్ టైమ్ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ లబ్ధి చేకూర్చాలని, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్చర్స్ ఫెడరేషన్ (588/2013) రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్‌ఎన్ దేవేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్చర్స్ జీవితాలు దుర్భరంగా మారాయని, ఎటువంటి లబ్ధి లేకుండానే రిటైర్‌మెంటు కావాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు సంస్థల్లో (రిలయన్స్, అమెజాన్) పనిచేస్తున్న వారు మధ్యలో మానేసిన వారికి సైతం ఎంతోకొంత పిఎఫ్ లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అలాంటిది ప్రభుత్వ సంస్థ అయి ఉండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కొనసాగుతున్న సమగ్ర శిక్షలో 2012 నుంచి పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్చర్లుగా విధులు నిర్వహిస్తున్నటువంటి ఉపాధ్యాయులు కనీసం రిటైర్‌మెంటు బెనిఫిట్స్ కూడా నోచుకోవడం లేదని అన్నారు.

ఎసిబి వలలో ఎస్ఐ, మున్సిపల్ ఆర్ఐ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎసిబి కాల్‌సెంటర్ 14400 నెంబరుకు వచ్చిన ఫిర్యాదు మేరకు ఒక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరు, మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టరుపై దాడులు చేసి కేసు నమోదు చేశారు. ఒంగోలుకు చెందిన బాధితుడు తన వాహనాన్ని మరొక వ్యక్తికి అవసరం కోసం ఇచ్చారు. ఆ వ్యక్తి ఆ వాహనానికి నకిలీ డాక్యుమెంట్ సృష్టించి మరొకరికి అప్పగించే అంశంపై వాహనదారుడు ఒంగోలు టూటౌన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఫిర్యాదుదారుని నుండి రూ.90 వేలు డిమాండ్ చేసి రూ.10 వేలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా ఒంగోలు టూటౌన్ ఎస్ మహబూబ్ బాషాను పట్టుకున్నారు. అలాగే శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటిపన్నును ప్రాసెస్ చేసేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేసిన మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టరు గౌరి శంకరరావును ఎసిబి అధికారులు పట్టుకున్నారు.

9వ ర్యాంక్‌లో ప్రణయ్

బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్ విడుదల

లాసన్నె: ప్రపంచ బ్యాడ్మింటన్ ఫెడరేషన్(బిడబ్ల్యుఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో భారత షట్లర్లు హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ సత్తా చాటారు. ఈ సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేస్తున్న ప్రణయ్ 9వ స్థానంలో, లక్ష్యసేన్ 11వ ర్యాంకుకు ఎగబాకారు. ఇటీవల ముగిసిన జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో లక్ష్యసేన్ సెమీస్‌కు చేరాడు. దీంతో అతడు 11వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

త్రీసా-గాయత్రి శుభారంభం

ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత డబుల్స్ జోడీకి మిశ్రమ ఫలితాలు దక్కాయి. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలిరౌండ్ పోటీలో త్రీసా జోలీ–గాయత్రి గోపీచంద్ జంట రెండోరౌండ్‌కు దూసుకెళ్లగా.. సిక్కిరెడ్డి–ఆరతి, అస్విని పొన్నప్ప–తానీషా జోడీ తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. ప్రపంచ 17వ ర్యాంక్ జోడీ అయిన త్రీసా–గాయత్రి 21–16, 21–17తో కెనడాకు చెందిన ఛోయ్–వుయ్‌పై వరుససెట్లలో గెలుపొందారు. ఇక సిక్కిరెడ్డి–ఆరతి జోడీ 14–21, 17–21తో చైనీస్ తైపీ జంట చేతిలో, తానీషా–అశ్విని పొన్నప్ప జోడీ 11–21, 21–14, 17–21తో ఇండోనేషియాకు చెందిన కుసుమ–ప్రథ్వీ చేతిలో పోరాడి ఓడారు. బుధవారం నుంచి సింగిల్స్ పోటీలు ప్రారంభం కానున్నాయి.

ఫైనల్లోకి సౌత్, ఈస్ట్‌జోన్స్

- సెంట్రల్‌జోన్‌పై ఏడు వికెట్ల తేడాతో సౌత్‌జోన్ గెలుపు
- దులీప్ ట్రోఫీ

పుదుచ్చేరి: దులీప్ ట్రోఫీ ఫైనల్లోకి సౌత్, ఈస్ట్‌జోన్ జట్లు దూసుకెళ్ళాయి. మంగళవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో సౌత్‌జోన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో సంఎట్రల్‌జోన్‌పై గెలుపొందగా.. ఈస్ట్‌జోన్ జట్టు 157పరుగుల తేడాతో వెస్ట్‌జోన్‌పై ఘన విజయం సాధించాయి. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ జట్టు 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 261పరుగులు చేసింది. యశ్ దూబే(77), శివమ్ మావి(38) బ్యాటింగ్‌లో రాణించగా.. మోహిత్‌కు మూడు, కౌశిక్, అర్జున్ టెండూల్కర్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో సాయి సుదర్శన్(132నాటౌట్) సెంచరీకి తోడు సుందర్(43నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో సౌత్‌జోన్ జట్టు 48.2ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 262పరుగులు చేసి గెలిచింది. మరో మ్యాచ్‌లో ఈస్ట్‌జోన్ జట్టు 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 319పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. వెస్ట్‌జోన్ జట్టు 34ఓవర్లలో 162పరుగులకే కుప్పకూలింది. మరో నామమాత్రపు మ్యాచ్‌లో నార్త్‌జోన్ జట్టు 9వికెట్ల తేడాతో నార్త్–ఈస్ట్‌జోన్‌పై గెలిచింది. గురువారం జరిగే ఫైనల్లో టైటిల్‌కై సౌత్, ఈస్ట్‌జోన్ జట్టు తలపడనున్నాయి.

పాయింట్ల పట్టిక

	మ్యా	గె	ఓ	నె.ర.	పా
1. సౌత్‌జోన్	5	5	0	+1.82	20
2. ఈస్ట్‌జోన్	5	4	1	+1.38	16
3. వెస్ట్‌జోన్	5	3	2	-0.16	12
4. నార్త్‌జోన్	5	2	3	-0.17	8
5. సెంట్రల్‌జోన్	5	1	4	+0.01	4
6. సెం.ఈ.జోన్	5	0	5	-3.30	0

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68